నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 21-8-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:16 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

సతతము దేశమ్మునకై
వ్రతులై సేవలను జేయువారిని-ఘనులన్
మతిమంతులుగా నెంచుచు
నతులిడి కొలువుము వరిష్ఠ నాగరికతతిన్

(ఆగష్టు 21 సీనియర్ సిటిజన్ దినం)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

మహిళలపై అత్యాచార
మృగత్వం ఘోరాలు
శిక్షపడక అనేకం
చిందులేసే నేరాలు
కోర్టులల్లో ఏళ్లకేళ్లు
కొనసాగితే కేసులు
విస్తరించవా లైంగిక
వేధింపుల రాశులు

-వేల్పుల నారాయణ
9440433475

మరో అయిదు రోజులు వానలు..అప్రమత్తంగా ఉండండి -మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఆగష్టు 20 :వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లకు ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి, జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జనజీవనానికి ఎలాంటి ఇబ్బంది ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వచ్చే ఐదు రోజుల్లో వర్షాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలన్నారు. గత రాత్రి నుంచి గ్రేటర్ హైదరాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినా వీలైనంత మేరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీస్కోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితిని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

మంకీపాక్స్‌పై కేంద్ర ఆరోగ్యశాఖ అప్రమత్తం.. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగష్టు 20 :మంకీపాక్స్ ప్రపంచదేశాలను వణికిస్తున్నది. ఆఫ్రికా దేశాల్లో పెద్ద ఎత్తున కేసులు నమోదవుతున్న విషయం తెలిసిందే. రోజు రోజుకు మంకీపాక్స్ పలు దేశాలకు సైతం విస్తరిస్తున్నది. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ మెడికల్ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. మంకీపాక్స్‌పై భారత ప్రభుత్వం సైతం అప్రమత్తమైంది. వైరస్‌ను ఎదుర్కొనేందుకు దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన దవాఖానాల్లో బెడ్‌లను రిజర్వ్ చేయడంతో పాటు ప్రధాన ల్యాబ్‌లను సైతం అప్రమత్తం చేసింది. వ్యాధి నిర్ధారణకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో రోగులకు ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేసింది.

చికిత్స చేయడంతో పరిశీలనలో ఉంచనున్నారు. ఢిల్లీ పరిధిలో పాజిటివ్ కేసులు నమోదైతే.. సదరు రోగులను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్పించనున్నారు. అలాగే, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో ఐదు పడకలను రిజర్వ్ చేశారు. ఆసుపత్రిలో చేరిన రోగుల్లో ఎవరికైనా మంకీపాక్స్ లక్షణాలు కనిపించినా.. మంకీపాక్స్ అనుమానిత కేసులు వచ్చినా వారిని ఆసుపత్రిలోనే ఏర్పాటు చేసిన బెడ్‌పై ఉంచి చికిత్స అందిస్తారు. ఢిల్లీలోని ఎయిమ్స్, రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్, సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, లేడీ హార్డింగ్ మెడికల్ హాస్పిల్స్‌ను మంకీపాక్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ అధికారులు కోరారు. అలాగే, వైరస్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్రాల్లోని ఆసుపత్రులకు అవసరమైన మార్గదర్శకాలను సైతం కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ జారీ చేసింది.

మరణంలోనూ వీడని బంధం.. రోడ్డు ప్రమాదంలో ట్విన్స్ మృతి..

ఖమ్మం, ఆగష్టు 20 : (నేటినిజం ప్రతినిధి): వారిరువురు (ట్విన్స్) కలిసే జన్మించారు కలిసే ఇన్నాళ్లు జీవించారు చివరకు విధి వక్రీకరించి రోడ్డు ప్రమాదంలో మరణంలోనూ ఇద్దరూ కలిసే మృత్యు ఒడిలోకి వెళ్ళారు? ఈ హృదయ విదారకరమైన సంఘటన ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.

రామన్నపేటకు చెందిన ఇద్దరు కవలలు (ట్విన్స్) కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి ముగ్గురు కలిసి ఖమ్మం నుంచి జక్కేపల్లి వెళ్తుండగా హైదరాబాద్ వైపు నుంచి ఖమ్మం వస్తున్న ఓ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు కవలలు అక్కడికక్కడే మృతిచెందగా మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను అన్నం ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆరుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ..

హైదరాబాద్, ఆగష్టు 20 :తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

దీంతో పాటు పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి బాధ్యతలు అప్పగించింది. ఇదిలా ఉంటే, ఇప్పటి వరకు ఆమ్రపాలికి కొన్ని అదనపు బాధ్యతలు ఉండగా వాటి నుంచి ప్రభుత్వం రిలీవ్ చేసింది.

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి పూర్తి బాధ్యతలు చేపట్టనుండగా?. మూసీ నది డెవలప్‌మెంట్ ఎండీగా దానకిషోర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్‌లకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఇక హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ కమిషనర్‌గా కోట శ్రీవాత్సవ, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్, హెచ్ఎండబ్ల్యూఎస్ (హైదరాబాద్ వాటర్ వర్క్స్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మయాంక్ మిట్టల్‌ను ప్రభుత్వం నియమించింది.

కోల్‌కతా ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగష్టు 20 :కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో జరిగిన ట్రైనీ డాక్టర్ రేప్, మర్డర్ ఘటనపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నది. ఆ బెంచ్‌లో జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలు ఉన్నారు. కోల్‌కతా ఘటన.. దేశవ్యాప్తంగా డాక్టర్ల భద్రత అంశం గురించి ఆందోళన కలిగిస్తోందని సీజేఐ అన్నారు. డాక్టర్ల గురించి ఆందోళన చెందుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అత్యాచార బాధితురాలి పేరు, ఫోటో, వీడియో క్లిప్ ఎలా బయటకు లీకైందని, బాధితురాలి పేరును వెల్లడించడం చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని, ప్రాణాలు కోల్పోయిన ఓ యువ డాక్టర్ గౌరవాన్ని ఇలాగేనా కాపాడేది అంటూ సుప్రీం ధర్మాసనం తెలిపింది. ట్రైనీ లేడీ డాక్టర్ ఘటనను సూసైడ్‌గా చిత్రీకరించిన ప్రిన్సిపల్ వైఖరిని సుప్రీం తప్పుపట్టింది. ఎందుకు ఆమె పేరెంట్స్‌కు బాడీ ని చూసే అవకాశాన్ని ఇవ్వలేదని ప్రశ్నించారు.

ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ గురించి కూడా సుప్రీం ప్రశ్నించింది. క్రైం ఉదయం పూట జరిగితే, ఎందుకు అప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని కోర్టు అడిగింది. రాత్రి 11.45 నిమిషాల వరకు ఎందుకు ఎఫ్ఐఆర్ రాయలేదని సీజేఐ ప్రశ్నించారు. అయితే అసహజ మరణం కింద కేసును రిజిస్టర్ చేసినట్లు సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ తెలిపారు. అర్ధరాత్రి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదంటే, అది మర్డరే అన్న సంకేతాన్ని ఇస్తుందని సుప్రీంకోర్టు తెలిపింది.

చంద్రయాన్ 4, 5 డిజైన్లు పూర్తి.. కేంద్రం అమోదం కోసం ఎదురుచూస్తున్నాం: ఇస్రో చైర్మెన్

న్యూఢిల్లీ: చంద్రయాన్ ప్రాజెక్టుకు చెందిన కొత్త అప్‌డేట్స్ ఇచ్చారు ఇస్రో చైర్మెన్(ఎఖీూ అష్ట్రజీతితీఎజీని) డాక్టర్ ఎస్ సోమనాథ్. చంద్రుడి మీదకు వరుసగా వ్యోమనౌకలను పంపినట్లు చెప్పిన ఆయన.. చంద్రయాన్ 3 సక్సెస్ అయినట్లు వెల్లడించారు. అయితే ప్రస్తుతం చంద్రయాన్ 4, 5 ప్రాజెక్టు డిజైన్లు పూర్తి అయ్యాయని, ఆ డిజైన్లకు ప్రభుత్వం నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్లు ఇస్రో చైర్మెన్ తెలిపారు. ఎల్‌వీఎం3 రాకెట్ తయారీ ఖర్చును తగ్గించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎవీఎం3 రాకెట్ తరహాలో కొత్త రాకెట్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఇది పేలోడ్‌ను మూడు రెట్లు అధికంగా మోసుకెళుందని ఆయన తెలిపారు. ఆగస్టు 23వ తేదీన జాతీయ అంతరిక్ష దినంగా పాటించనున్నట్లు చెప్పారు. 23ను నేషనల్ స్పేస్ డేగా కేంద్ర సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే.

హరియాణలో కాంగ్రెస్‌దే అధికారం : కుమారి సెల్జా

న్యూఢిల్లీ, ఆగష్టు 20 :హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ సిర్సా ఎంపీ కుమారి సెల్జా ఆశాభావం వ్యక్తం చేశారు. హరియాణలో ప్రజలు మార్పు కోరుతున్నారని, కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయాలా వద్దా అనే విషయంలో పార్టీ హైకమాండ్‌దే తుది నిర్ణయమని ఆమె స్పష్టం చేశారు.

పార్టీ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. ఇక రాజీవ్ గాంధీ ప్రేరణతోనే తాము రాజకీయాల్లోకి వచ్చామని ఆయన స్ఫూర్తితో రాజకీయాల్లో ఎదిగామని చెప్పారు. గతంలో రాజీవ్ నాయకత్వం పట్ల యువత ఆకర్షితులవగా, ఇప్పుడు రాహుల్ గాంధీ యువతలో స్ఫూర్తి నింపుతున్నారని అన్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు హరియాణలో జన్‌నాయక్ జనతా పార్టీ (ఏఏఖ)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జేజేపీ సీనియర్ నేత పలరాం సైని ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. తాను లోక్‌సభ ఎన్నికల్లో జేజేపీ నుంచి పోటీ చేశానని, తన విజయానికి పార్టీ శ్రేణులు కలిసిరాలేదని చెప్పారు. కైథాల్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో జేజేపీ జిల్లా అధ్యక్షుడు రణదీప్ కౌల్ పార్టీకి, తనకు మద్దతు తెలపలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

స్వచ్ఛ బయో డీల్ పై ఈడికి బి ఆర్ ఎస్ ఫిర్యాదు..

హైదరాబాద్, ఆగష్టు 20 : అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బృందం స్వచ్ఛ బయో సంస్థతో రూ.1000 కోట్ల పెట్టుబడుల కోసం ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఈ డీల్ వెనుక పరస్పర ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్? ఈడీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడిపై ప్రతిపక్ష పార్టీ ఆరోపణ లను గుప్పించింది. స్వచ్ఛ బయో, ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

బీఆర్ఎస్ తెలిపిన వివరాల ప్రకారం ప్రతిపక్షం ఇచ్చిన ఫిర్యాదును ఈడీ స్వీకరించి, రసీదు ఇచ్చింది. స్వచ్ఛ బయో డైరెక్టర్‌లలో ఒకరు స్వయానా సీఎం సోదరుడు అనుముల జగదీశ్వర్ రెడ్డి ఉన్నారని, ఇది క్విడ్ ప్రోకో అని బీఆర్ఎస్ ఆరోపించింది. స్వచ్ఛ బయో డైరెక్టర్లలో ఒకరు అనుముల జగదీశ్వర్ రడ్డి కావడం ఆందోళన కలిగించే అంశమని, ఇది ఈ ఎంవోయూ చిత్తశుద్ధిని ప్రశ్నించే విధంగా ఉందని ఈడీకి రాసిన లేఖలో పేర్కొంది.

అమెరికాలోని ఫిలడెల్ఫియాలో సీఎం అధికారిక పర్యటనకు కేవలం 15 రోజుల ముందు స్వచ్ఛ బయోను తెరపైకి తీసుకు వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో రిజిస్టర్ అయిన ఈ కంపెనీ ఇప్పటి వరకు ఎలాంటి క్రియాశీల వ్యాపార కార్యకలాపాలు నిర్వహించలేదని, ఇది షెల్ కంపెనీ అని ఆరోపించింది.

ఈ కంపెనీని అమెరికాలోనే ఎందుకు ప్రకటించారు ప్రయోజనం ఏమిటి ఈ కంపెనీలో విదేశీ నిధులు ఉన్నాయా మనీ లాండరింగ్ ఉందా అనే అంశాలు తెలియాల్సి ఉందని పేర్కొంది. ఎంవోయూపై సంతకం చేసే సమయంలో రేవంత్ రెడ్డి పక్కన హర్ష పసునూరి ఉండటంపై కూడా తన ఫిర్యాదులో బీఆర్ఎస్ అనుమానం వ్యక్తం చేసింది. ఎంవోయూపై సంతకాలు చేసిన సమయంలో సీఎం పక్కన ఉన్న వ్యక్తి పసునూరి హర్ష అని వెల్లడించింది. హర్ష పసునూరి, సీఎం సోదరుడు తమ ఆర్థిక పరిస్థితిని వివరించాలని, రూ.1000 కోట్ల పెట్టుబడులు ఎలా పెడతారో చెప్పాలని డిమాండ్ చేసింది.

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం : సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగష్టు 20 :డిసెంబర్ 9న సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రేవంత్ ప్రకటించారు. తెలంగాణ స్ఫూర్తిని కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని, నైతికతను ఎవరూ శంకించాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా సీఎం అన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం కోసం స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు ప్రతిపాదన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు స్థల పరిశీలన చేశారు. సచివాలయం ఆవరణలో భవన ప్రధాన ద్వారం ముందు భాగం విగ్రహ ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా భావించారు.

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర అధికార కేంద్రమైన సెక్రటేరియట్ సముచితమైన స్థానమని, అక్కడే తెలంగాణ తల్లిని సగర్వంగా, సగౌరవంగా ప్రతిష్ఠిస్తామని సీఎం స్పష్టం చేశారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అందులో భాగంగా సచివాలయ ఆవరణలో స్థల అన్వేషణను ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తో కలిసి స్వయంగా తిరిగి పరిశీలించారు.

ఆ తర్వాత విగ్రహ ఏర్పాటుకు ప్రతిపాదిత స్థలం, ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్దడానికి అనుగుణమైన డిజైన్ కూర్పుపై అధికారులతో చర్చించారు. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబం చేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

మ్యాన్‌హోల్స్ ఓపెన్ చేయొద్దు : ఆమ్రపాలి

హైదరాబాద్, ఆగష్టు 20 : రహదారులపై నీరు నిలవడం వల్ల ప్రమాదాలు జరగకుండా క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం అడిషనల్, జోనల్ కమిషనర్‌లతో ఆమ్రపాలి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రధాన రహదారిపై ప్రాజెక్టు సైట్ వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రహదారులపై మరమ్మత్తులు చేస్తున్న స్థలం వద్ద ప్రమాదం సంభవించకుండా..భద్రతా చర్యల్లో భాగంగా బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులతో పాటు రాత్రి సమయంలో లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బహుళ అంతస్థుల నిర్మాణాలు, నాలాలు, నీటి వనరుల వద్ద కూడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

వర్షాలతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.

మెహిదీపట్నం, హఫీజ్‌నగర్, అత్తాపూర్, గుడి మల్కాపూర్, విజయ్‌నగర్ కాలనీ, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వాటర్ లాగింగ్ పాయింట్లను కమిషనర్ పరిశీలించారు.

వర్షాలతో తలెత్తిన సమస్యలపై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. స్క్వార్డ్ వాటర్ డ్రైన్ మ్యాన్‌హోల్స్ ఓపెన్ చేయవద్దని కమిషనర్ సూచించారు.

వైద్యులు వీలైనంత త్వరగా విధుల్లోకి చేరండి.. సుప్రీంకోర్టు విజ్ఞప్తి

కోల్‌కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ గత 10 రోజులుగా వైద్యులు దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. వైద్యుల నిరసనతో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు సమ్మెను విరమించి తమ విధుల్లోకి చేరాలని దేశ అత్యున్నత న్యాయస్థానం (ూబీజూతీఎవఎ అనీబీతీబి) కోరింది.

ట్రైనీ వైద్యురాలి హత్యాచార కేసును సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారిస్తున్న విషయం తెలిసిందే. ఆ బెంచ్‌లో జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలు ఉన్నారు. విచారణ సందర్భంగా జూనియర్, సీనియర్ డాక్టర్ల భద్రతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, డాక్టర్ల సమ్మెతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొంది. ఈ మేరకు వైద్యులు వెంటనే సమ్మె విరమించి తమ విధుల్లోకి చేరాలని కోరింది. 'వైద్యులందరి భద్రత, సంక్షేమానికి సంబంధించిన విషయాలను కోర్టు పరిశీలిస్తున్నందున.. ప్రస్తుతం విధులకు దూరంగా ఉన్న వైద్యులు వీలైనంత త్వరగా తిరిగి విధుల్లోకి చేరాలని మేము కోరుతున్నాము' అని సుప్రీం ధర్మాసనం తెలిపింది.

వైద్యుల భద్రతకై జాతీయ టాస్క్ ఫోర్స్..

మరోవైపు ఈ ఘటన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు(ూబీజూతీఎవఎ అనీబీతీబి) ఇవాళ ఓ జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. డాక్టర్ల భద్రత గురించి టాస్క్ ఫోర్స్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మెడికల్ ప్రొఫెషనల్స్ ఎవరైనా సరే.. వారికి సామాజిక భద్రత కల్పించడమే ఆ టాస్క్ ఫోర్స్ ఉద్దేశంగా పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా డాక్టర్ల భద్రత గురించి ఏకాభిప్రాయాన్ని క్రియేట్ చేయాలని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ బృందంలోని సభ్యుల పేర్లను కూడా సుప్రీం వెల్లడించింది.

జాతీయ టాస్క్ ఫోర్స్ బృందం జాబితా: సర్జర్ వైస్ అడ్మిరల్ ఆర్ సరిన్, డాక్టర్ డీ నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎం శ్రీనివాస్ , డాక్టర్ ప్రతిమా మూర్తి, డాక్టర్ గోవర్ధన్ దత్ పురి, డాక్టర్ సౌమిత్ర రావత్, ప్రొఫెసర్ అనితా సక్సేనా(ఎయిమ్స్ కార్డియాలజిస్ట్), ప్రొఫెసర్ పల్లవి సప్రే (ముంబై గ్రాంట్ కాలేజీ డీన్), డాక్టర్ పద్మ శ్రీవాత్సవ్ (ఎయిమ్స్ న్యూరాలజీ) ఉన్నారు. వీరితో పాటు భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటరీ, కేంద్ర ప్రభుత్వం హోం కార్యదర్శి, కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, జాతీయ మెడికల్ కమిషన్ చైర్‌పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్స్ ప్రెసిడెంట్ ఆ జాబితాలో ఉన్నారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా దాతలకు వసతి రద్దు



తిరుపతి, ఆగష్టు 20 : తిరుమలలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అక్టోబరు 4 నుంచి 12 వరకు దాతలకు వసతి సౌకర్యాన్ని రద్దు చేస్తున్నట్లు టీటీడీ అధికారులు ప్రకటించారు. బ్రహ్మోత్సవాల్లో సాధారణ యాత్రికులకు మరిన్ని వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

వివిధ ట్రస్ట్‌లు, స్కీమ్‌ల దాతల కోసం వసతి బ్లాక్ చేయబడిందని తెలిపారు.

అక్టోబరు 4న ధ్వజారోహణం, అక్టోబర్ 12న చక్రస్నానం జరిగే రోజుల్లో మినహా దాతలకు అందుబాటులో ఉన్న ప్రత్యేకాధికారాల ప్రకారం దర్శనానికి మాత్రమే అనుమతి ఉంటుందని, దాతలు ఈ విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించాలని కోరారు.

స్వామివారి హుండీ ఆదాయం రూ. 3.89 కోట్లు

తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో 22 కంపార్టుమెంట్లు నిండిపోగా టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందన్నారు. నిన్న స్వామివారిని 71,595 మంది భక్తులు దర్శించుకోగా 28,981 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.89 కోట్లు వచ్చిందన్నారు.

వైద్యులకే సుస్తీ చేస్తే ప్రజారోగ్యానికి దిక్కేది?.!

("నేషనల్ మెడికల్ కమీషన్ టాస్క్‌ఫోర్స్" తాజా సర్వే వివరాల ఆధారంగా)

వైద్యులు, వైద్య విద్యార్థులకు సహితం శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు వెంటాడితే ప్రజారోగ్యానికి దిక్కెవరని నివ్వెర పోవలసిన సందర్భమిది. మెడికల్ అండర్ గ్రాడ్యుయేట్స్ (ఎంబిబిఎస్)తో పాటు పిజీ(ఎండి, ఎంఎస్) చేస్తున్న వైద్య విద్యార్థులు రేపటి ప్రజారోగ్య పరిరక్షణకు పునాదిగా నేటి వైద్య విద్య నిలుస్తున్నది. వైద్య విద్య ద్వారా రేపటి వైద్యులకు అవసరమైన విద్య, జ్ఞానం, నైపుణ్యాలను అందించే మహా యజ్ఞాన్ని వైద్య కళాశాలలు నిర్వహిస్తున్నాయి. ఎంబిబిఎస్/పిజీ వైద్య విద్య పూర్తి చేసిన యువ వైద్యులకు ఆర్థిక వెసులుబాటు కలినప్పటికీ వైద్య విద్యాభ్యాసం మాత్రం ఒక సవాళుగా నిలుస్తున్నది. వైద్య కళాశాలలో సీటు రావడానికి బాల్యం నుంచే విపరీతమైన ఒత్తిడి అనుభవించడంతో పాటు నిరాటకంగా శ్రమ, అంకితభావం, భావోద్వేగ/ఆర్థిక పెట్టుబడులు పెట్టవలసి వస్తున్నది. వైద్య విద్యార్థులు కళాశాలలో తీవ్రమైన శారీరక, మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, ఇది ప్రమాదకర స్థాయికి చేరుతున్నదని "నేషనల్ మెడికల్ కమీషన్(ఎన్ఎంసి) టాస్క్‌ఫోర్స్" తాజా సర్వే నివేదిక స్పష్టం చేయడంతో వైద్య సమాజం నివ్వెరపోవడం చూస్తున్నాం.

వైద్య విద్యార్థుల్లో మానసిక అనారోగ్యం, ఆత్మహత్య ఆలోచనలు:

ఎన్ఎంసి టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన తాజా సర్వే వివరాల ప్రకారం గత ఐదేళ్లలో వైద్య విద్యార్థులు శారీరక, మానసిక ఒత్తిడిని తట్టుకోలేక 122 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు తెలుస్తున్నది. ఎన్ఎంసి నిర్వహించిన సర్వేలో 25,590 మంది యూజీ (ఎంబిబిఎస్) విద్యార్థులు, 5,337 మంది పిజీ(ఎండి, ఎంఎస్, సూపర్ స్పెషాలిటీ) చేస్తున్న విద్యార్థులు, 7,035 మంది వైద్య కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారని నివేదిక స్పష్టం చేసింది. మెడికల్ యూజీ విద్యార్థుల్లో 27.8 శాతం మంది మానసిక అనారోగ్యంతో, 16.2 శాతం మంది ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు చేస్తున్నారని స్పష్టం అవుతున్నది. మెడికల్ పిజీ విద్యార్థుల్లో 31.23 శాతం మంది ఆత్మహత్యల ఆలోచనలు చేస్తున్నారని, 4.4 శాతం మంది గత సంవత్సరం ఆత్మహత్య ప్రయత్నాలు చేసినట్లు సర్వే వివరిస్తున్నది.

ఎన్ఎంసి టాస్క్‌ఫోర్స్ తాజా ప్రధాన సిఫార్సులు:

వైద్య విద్యార్థులను శారీరక, మానసిక అనారోగ్యాల నుంచి కాపాడడానికి ఎన్ఎంసి నివేదిక పలు (44) సిఫార్సులు చేయడం జరిగింది:

వైద్య కళాశాలలో చేరిన వెంటనే వైద్య వృత్తిలో ఇమిడి ఉన్న సవాళ్లను వివరిస్తూ యూజీ విద్యార్థులకు 4 మాసాలు, పిజీ విద్యార్థులకు 'ఓరియంటేషన్ ప్రోగ్రామ్'ను నిర్వహించాలి. వైద్య విద్యార్థుల కుటుంబాలను కూడా తరుచుగా సమావేశపరిచి విద్యార్థుల వృత్తి సవాళ్లను వివరించాలి. ఆంటీ-ర్యాగింగ్ కమిటీలను తప్పనిసరి ఏర్పాటు చేసి ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టాలి. విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న మానసిక అనారోగ్యాలను తరుచుగా చర్చించి, బయటపడే మార్గాలను వివరించాలి. మెడికల్ కళాశాలల్లో 24/7 పటిష్టమైన కౌన్సిలింగ్ సేవలు(టెలీ-మనస్ లాంటివి) అందుబాటులో ఉంచాలి. వైద్య కళాశాలల సిబ్బంది, విద్యార్థులకు ప్రత్యేక ఉచిత వైద్య సేవల విభాగాలను ఏర్పాటు చేయాలి. వైద్య కళాశాలల్లో ఆధునిక వసతులు/మౌళిక వనరులు (మంచి హాస్టల్, వాష్ రూమ్స్, సురక్షిత నీరు, నాణ్యమైన ఆహారం, పనిలో భద్రత, వినోద కార్యక్రమాలు, పరిమిత ఫీజులు లాంటివి) కల్పించాలి. వైద్య కళాశాలల హాస్టల్స్‌లో విద్యార్థుల అభిరుచిని బట్టి పోషకాహార మెనూతో కూడిన ఆహారం అందించాలి.

వైద్య విద్యార్థులకు వారానికి ఒక రోజు సెలవుతో పాటు వారానికి 74 గంటలు మించకుండా డ్యూటీ అప్పగించాలి. ప్రతి రోజు 7 - 8 గంటలు నిద్రకు సమయం ఇవ్వాలి. ముఖ్యంగా పిజీ, ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులకు ప్రత్యేక టైం టేబుల్ అమలు చేయాలి. వైద్య కళాశాలల్లో పరిసరాల శుభ్రత, సుందర ప్రాంగణ నిర్వహణలు, అహ్లాదకరమైన తోటలు, క్రీడా మైదానాలు ఉండేలా చూసుకోవాలి. డ్యూటీ రూమ్‌లో పోషకాహారం అందుబాటులో ఉంచాలి. వివాహం చేసుకున్న విద్యార్థులకు/కుటుంబాలకు/పిల్లలకు ప్రత్యేక వసతులు(పిల్లల ఆలన పాలన, డే కేర్ సౌకర్యాలు, గర్భిణి స్త్రీలకా ప్రత్యేక సెలవులు లాంటివి) కల్పించాలి.

విద్యార్థుల పరీక్షలు, మూల్యాంకనాలను పక్షపారరహితంగా ఒక శాస్త్రీయ పద్ధతి ప్రకారం నిర్వహించాలి. విద్యార్థులు, అధ్యాపకుల నుంచి తరుచుగా తమ అభిప్రాయాలను తెలుసుకొని సమస్యల పరిష్కారాలకు యాజమాన్యాలు పూనుకోవాలి. సమస్యల పరిష్కార విభాగం, పారదర్శక కార్యాచరణ, జవాబుదారీతనం, వేధింపులకు తావు లేకుండా చూసుకోవాలి.

ఈ-కంప్లేంట్ విభాగాన్ని ఏర్పాటు చేసి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. సమస్యలను తెలుసు కోవడానికి, సలహాలు ఇవ్వడానికి విద్యార్థులకు సరైన మెంటర్ లేదా గురువును నియమించాలి. విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా ఫీజులను వసూలు చేయడం, సెమిస్టర్‌ను రిపీట్ చేసే వారి నుండి అదనపు ఫీజులు వసూలు చేయరాదు.

విద్యార్థుల నుంచి పిర్యాదుల స్వీకరణ, నిష్పాక్షిక పరిష్కారాలను ఇవ్వడానికి టీచర్స్ వ్యవస్థను ఏర్పాటు చేయడం, గురువులకు అవసర సదుపాయాలు కల్పించాలి. వైద్యులకు/వైద్య విద్యార్థులకు అన్ని కళాశాలల్లో ఒకే రకమైన ఫీజులు, వేతనాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్స్ ఉండే విధంగా చూడాలి. ఏఐఐఎంఎస్ సంస్థలో అందించే వేతనాలు, పారితోషికాలు, పెన్షన్స్ అన్ని కళాశాలల్లో అమలు పరచాలి.

ఆత్మహత్యల ఆలోచనలు రాకుండా అనువైన వాతావరణం కల్పించాలి. వైద్య విద్యార్థులు, అధ్యాపకుల కుటుంబాలు సెలవు రోజుల్లో యాత్రలు చేసే విధంగా ప్రోత్సహించాలి. విద్యార్థులకు గేట్‌కీపర్ ట్రేనింగ్ వ్యవస్థలను అమలు చేయాలి.

కళాశాలల్లో పిజీ, సూపర్ స్పెషాలిటీ సీట్లను పెంచాలి. కళాశాలల్లో అన్ని విభాగాల్లో అవసరమైన సిబ్బందిని పూర్తిగా నియమించాలి. విద్యార్థుల నుంచి కాలపరిమితితో కూడిన బాండ్స్ తీసుకోవడాన్ని తగ్గించాలి. వైద్య విద్యార్థుల శిక్షణలో ఆధునిక టెక్నాలజీ వసతులు కల్పించాలి. కళాశాలలో సరైన వసతులు, పుస్తకాలు కలిగిన గ్రంథాలయాన్ని నిర్వహించాలి.

వ్యాల్యూ - ఆడెడ్ ఆప్షనల్ కోర్సులు అందుబాటులోకి తేవాలి. అవసరాన్ని బట్టి గెస్ట్ ఫాకుల్టీ అనుభవాలను ఏర్పాటు చేయాలి. వృత్తిపరమైన భాషా పరిజ్ఞానాన్ని అందించాలి.

సకాలంలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ఒత్తిడిని తగ్గించాలి. తరుచుగా పర్యవేక్షణ చేస్తూ 'గోస్ట్ ఫ్యాకుల్టీ' సమస్యలను నివారించాలి. వైద్య కళాశాల అధ్యాపకులకు తరుచుగా శిక్షణలను ఏర్పాటు చేయాలి.

క్యారిర్ కౌన్సిలింగ్, ప్రాంగణ నియామకాలను నిర్వహించాలి. పటిష్టమైన హెల్త్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలి. ఆధునిక శిక్షణకు ఐసిఏఆర్ఈఆర్ సంస్థలను ఏర్పాటు చేయాలి. స్థానిక సంస్థలతో అనుసంధానం కొనసాగించాలి. మానసిక ప్రశాంతతకు యోగా తరగతులు నిర్వహించాలి.

విద్యార్థులు, అధ్యాపకులు, కుటుంబ సభ్యులకు ప్రత్యేక సలహాల వ్యవస్థ ఉండాలి.

మానసిక ఆరోగ్యం, సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేయాలి. శారీరక పటిష్టతకు దోహదం చేసే క్రీడలను ప్రోత్సహించాలి. సోషల్, సాంస్కృతిక ప్రాంగణ కౌన్సిల్స్ ఏర్పాటు చేయాలి.

వైద్య విద్యార్థులపై పని ఒత్తిడి పెరగకుండా చూసుకోవడం, ఓవర్ డ్యూటీలు నివారించడం, వినోద కార్యక్రమాలను తరుచుగా ఏర్పాటు చేయడం, వారానికి 74 పని గంటలు మించకుండా చూసుకోవడం, పిర్యాదులను విని తీర్చగలిగే వ్యవస్థలను అందుబాటులో ఉంచడం, వేతనాల్లో సమానత్వాలను సాధించడం, అధిక ఫీజులు వసూలు చేయకుండా చూడడం, నాణ్యమైన విద్యను అందించడం, ఆధునిక ప్రయోగశాలలు/టెక్నాలజీలను అందుబాటులోకి తేవడం, హాస్టల్‌లో పోషకాహారం అందించడం, నిరంతరం విద్యార్థుల మానసిక స్థితులను తెలుసుకోవడం లాంటి ఎన్ఎంసి సిఫార్సులను అన్ని వైద్య కళాశాలలు అమలు పరుస్తూ, ఆత్మహత్యల ఆలోచనలకు తావులేకుండా రేపటి వైద్యులకు నాణ్యమైన విద్యను అందించాలి.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

"మా వాటా మాకే"పుస్తకావిష్కరణ

హైదరాబాద్, ఆగష్టు 20 :చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై రూపొందించిన " మా వాటా మాకే " పుస్తకాన్ని ఆగష్టు 13 న ఆవిష్కరించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో గల గ్రీన్ బెల్ట్ లోని వివిధ విగ్రహాల దగ్గర ప్రముఖ బిసి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలమూరు జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రముఖ న్యాయవాది బెక్కెం జనార్దన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి బిసి కమిషన్ సభ్యులుగా పనిచేసిన జూలూరు గౌరీశంకర్ రచించిన "మా వాటా మాకే" పుస్తకాన్ని బిసి రిజర్వేషన్ల గురించి రాసిన విలువైన పుస్తకమని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా బిసీల బతుకులు మారడం లేదన్నారు. రాజ్యమంతా అగ్రకులాల చేతుల్లోనే ఉందన్నారు. దేశజనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలు అధికారానికి ఆమడదూరంలో ఉన్నారన్నారు. బీసీలందరూ సంఘటితమై కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పద్మావతి కాలనీలో ఉన్న ఒక్కో విగ్రహం దగ్గర, అంబేద్కర్ విగ్రహం దగ్గర, జలజం కళాశాల దగ్గర ఒక్కొక్క బిసి నాయకులు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బీసీ నాయకులు కె.లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర మేదరి సంఘం రాష్ట్ర బాధ్యులు కందూరి వెంకట్రాముడు, జిల్లా మాజీ విద్యా శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయ్ కుమార్, జిల్లా పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షులు ఎల్. గంగాధర్, బీసీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. పాండురంగం, ఎన్. ప్రభాకర్, బిసిటిఎ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణుడు, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డా. భీంపల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు అశ్విని చంద్రశేఖర్, కొప్పోలు యాదయ్య, ప్రైవేటు జూనియర్ కాలేజీ మేనేజ్ మెంట్ ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రధాన కార్యదర్శి సురగొని రమేష్ గౌడ్, విశ్రాంత సి.సి. చంద్రమౌళి, పాలమూరు యువకవుల వేదిక జిల్లా అధ్యక్షులు బోల యాదయ్య, ప్రముఖ బీసీ నాయకులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన, భారత విదేశాంగ శాఖకు చెందిన శిక్షణార్థులైన అధికారులు

న్యూఢిల్లీ, ఆగష్టు 20 :భారత విదేశాంగ శాఖకు చెందిన శిక్షణలోని అధికారులు (2023 బ్యాచ్), 2024 ఆగస్టు 19న రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మును రాష్ట్రపతి నిలయంలో కలుసుకున్నారు.

తనను కలుసుకున్న అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రపతి, విదేశాంగ విధానం అనేది అమూర్త కార్యకలాపమో,లేదా ఉన్నతశ్రేణి వ్యక్తుల ఆలోచనల సమాహారమో కాదని, ఇది దేశీయ విధానాలకు కొనసాగింపు అని అన్నారు. ఇది దేశ రాజకీయ, ఆర్థిక, భద్రతా ప్రయోజనాలు, ప్రాదేశిక సమగ్రతను సాధించేందుకు ఉద్దేశించినదని ఆమె అన్నారు. అందువల్ల మనదేశ ప్రయోజనాల పరిరక్షణ మాత్రమే కాకుండా, 2047 నాటికి వికసిత్ భారత్ వ్యూహాత్మక లక్ష్యాన్ని సాధించేందుకు అంతర్జాతీయ అజెండాకు రూపకల్పన చేయాల్సిన బాధ్యత కూడా భారత విదేశాంగ శాఖ అధికారులపై ఉందని రాష్ట్రపతి అన్నారు.

ఐఎఫ్ఎస్ అధికారులు తాము కేవలం భారత ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని కాక,1.4 కోట్ల మంది భారతీయులకు, వారి ఆశలు , ఆకాంక్షలకు ప్రతినిధులుగా ఉన్నామని గుర్తుంచుకోవాలన్నారు. అలాగే విదేశాంగ శాఖ అధికారులు తాము 5000 సంవత్సరాల పురాతన ఘన నాగరికతకు,వైవిధ్యతతో కూడిన, బహుళ సంస్కృతికి , ఊహించలేని పరిణామాలు ముంచెత్తుతున్న ప్రస్తుత ప్రపంచంలో మంచికి, సుస్థిరతకు ఒక బలమైన శక్తిగా ఉన్న సమాజానికి తాము ప్రాతినిధ్యం వహిస్తున్నామని గుర్తించాలన్నారు. ఇది వారిలో ప్రతి ఒక్కరిపై బృహత్తర బాధ్యతను ఉంచుతుందని రాష్ట్రపతి అన్నారు.

మంచి దౌత్యవేత్త కావాలంటే అందుకు నిర్దిష్టమైన నైపుణ్యాలు అవసరమని అంటూ రాష్ట్రపతి, వారికి మంచి భావ ప్రసార నైపుణ్యాలు ఉండాలని, వ్యూహాత్మక ఆలోచనా పరులు కావాలని అన్నారు.అదే సమయంలో వారికి ఇండియాకు సంబంధించి, తమకు ఆతిథ్యం ఇచ్చే దేశం గురించిన రాజకీయ, సాంస్కృతిక అంశాలపైన లోతైన అవగాహన ఉండాలన్నారు. విదేశాంగశాఖ శిక్షణార్థులైన అధికారులు తొలి పోస్టింగ్ గా విదేశాలకు విదేశీ భాషల శిక్షణకు వెళతారని అంటూ,వీలైనన్ని ఎక్కువ భాషలు నేర్చుకోవలసిందిగా రాష్ట్రపతి వారికి సూచించారు. అలాగే కొత్త సంస్కృతులు, అక్కడి ప్రజలతో మమేకం కావండం, సాంకేతికతను అందిపుచ్చుకోవడం చేయాలన్నారు.ఈ నైపుణ్యాలు,వ్యవహరణ వారిని ఒక పరిపూర్ణ దౌత్యవేత్తగా తీర్చిదిద్దుతాయని ఆమె అన్నారు.

డిపాజిట్లు పెంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆర్థిక మంత్రి ఆదేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 20 :కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈరోజు న్యూఢిల్లీలో ప్రభుత్వ రంగ బ్యాంకుల (పిఎస్బిలు) ఆర్థిక పారామితులు, డిపాజిట్ సమీకరణ, డిజిటల్ చెల్లింపులు, సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ల మొదలైనా అంశాలలో పనితీరుపై సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించారు. పిఎస్బిలకు సంబంధించిన ఆర్థిక చేరిక, రుణ సదుపాయాన్ని పొందడంలో ఎదురవుతున్న సవాళ్ళను కూడా ఈ సమావేశంలో చర్చించారు. .

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ కార్యదర్శి డాక్టర్ వివేక్ జోషి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్)కి కార్యదర్శిగా నియుక్తులవుతున్న శ్రీ ఎం. నాగరాజు, సీనియర్ అధికారులతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకుల (పిఎస్బి) అధిపతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. .

2023 ఆర్థిక సంవత్సరంలో పిఎస్బిలు అన్ని ఆర్థిక పరామితులలో మెరుగైన పనితీరు కనబరిచాయని సమావేశంలో అధికారులు వెల్లడించారు. నికర నిరర్థక ఆస్తులు (ఎన్ఎన్పిఏ)లు 0.76 శాతానికి తగ్గడం, మెరుగైన ఆస్తుల నాణ్యత, బ్యాంకుల మూలధన సమృద్ధి 15.55 నమోదు కావడం సానుకూల అంశాలుగా సమావేశం అభిప్రాయపడింది. బ్యాంకుల నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.22 శాతం కాగా అత్యధిక నికర మొత్తం లాభం 1.45 లక్షల కోట్లు ఉండగా వాటాదారులకు రూ.27,830 కోట్ల డివిడెండ్ ఇవ్వగలిగారు. వివిధ పారామితులపై మెరుగుదలలు, మార్కెట్ల నుండి మూలధనాన్ని సేకరించేలా పిఎస్బి ల సామర్థ్యాన్ని కూడా పెంచాయి.

డిపాజిట్ సమీకరణపై చర్చల సందర్భంగా, కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడుతూ, క్రెడిట్ వృద్ధి పుంజుకున్నప్పుడు, అందుకు తగ్గట్టు నిలకడగా నిధులు సమకూర్చడానికి డిపాజిట్ల సమీకరణను మరింత మెరుగుపరచవచ్చని అన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం ద్వారా డిపాజిట్లను సేకరించేందుకు బ్యాంకులు సమిష్టి కృషి చేయాలని కోరారు. సమర్థవంతమైన కస్టమర్ సర్వీస్ డెలివరీ కోసం పిఎస్బిలు తమ కస్టమర్లతో మెరుగైన సంబంధాలను కలిగి ఉండాలని సీతారామన్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ, సెమి-అర్బన్ ప్రాంతాలలో ఉద్యోగులు తమ ఖాతాదారులతో కనెక్ట్ అయ్యేలా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి బ్యాంకులను కోరారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో అత్యుత్తమ అభ్యాసాలను పంచుకోవడం ద్వారా సంబంధిత బలాలను పెంచుకోవడానికి సహకారాన్ని అన్వేషించాలని, బ్యాంకింగ్ రంగంలో మార్పులకు అనుగుణంగా తమను తాము సన్నద్ధం చేసుకోవాలని పిఎస్బిలను శ్రీమతి సీతారామన్ కోరారు

ఆస్తుల నాణ్యతను మెరుగుపరచడానికి బ్యాంకులు చేసిన ప్రయత్నాలను అంగీకరిస్తూ,ఎన్ సి ఎల్ టి, ఎన్ ఏ ఆర్ సి ఎల్ అందించే రిజల్యూషన్, రికవరీ పరిధిని ఆప్టిమైజ్ చేయాలని శ్రీమతి సీతారామన్ వారికి సూచించారు.

డిజిటల్ చెల్లింపులు, సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌లకు సంబంధించిన అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. సైబర్ భద్రతకు సంబంధించిన సమస్యలను వ్యవస్థాగత కోణం నుండి చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి సలహా ఇచ్చారు. సైబర్-రిస్క్‌లకు వ్యతిరేకంగా అవసరమైన ఉపశమనాలను ఉంచడానికి బ్యాంకులు, ప్రభుత్వం, రెగ్యులేటర్లు, భద్రతా ఏజెన్సీల మధ్య సహకారం అవసరమని స్పష్టం చేశారు. బ్యాంకు వ్యవస్థల భద్రతకు భంగం కలగకుండా లేదా రాజీ పడకుండా చూసేందుకు ఐటి వ్యవస్థలోని ప్రతి అంశాన్ని కాలానుగుణంగా, సైబర్ సెక్యూరిటీ కోణం నుండి పూర్తిగా సమీక్షించాలని కేంద్ర ఆర్థిక మంత్రి కోరారు.

అట్టడుగున ఉన్న పౌరులకు వారి జీవనోపాధికి మద్దతుగా, జీవితాలను మెరుగుపరిచేందుకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం ఎల్లప్పుడూ క్రెడిట్ యాక్సెస్‌ను సులభతరం చేయడానికి ప్రయత్నిస్తుందని శ్రీమతి సీతారామన్ పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీలు, నగదు లావాదేవీల ఆధారంగా ఎంఎస్ఎంఈలకు కొత్త క్రెడిట్ అసెస్‌మెంట్ మోడల్‌తో సహా ఇటీవలి బడ్జెట్ ప్రకటనలను త్వరితగతిన అమలు చేయాలని ఆమె బ్యాంకులను కోరారు. పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, పిఎం విశ్వకర్మ యోజన వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణ జారీని మరింత పెంచడంపై దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి బ్యాంకులను ఆదేశించారు.

రుణాలు మూసివేసిన తర్వాత భద్రతా పత్రాలను అందజేసే విషయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి బ్యాంకులకు సూచించారు. కస్టమర్‌కు పత్రాలను అందజేయడంలో ఎటువంటి ఆలస్యం చేయరాదని ఆదేశించారు.

న్యూఢిల్లీలో భారత-జపాన్ రక్షణ/విదేశాంగ శాఖ మంత్రుల మధ్య మూడో దఫా 2+2 చర్చలు

న్యూఢిల్లీ, ఆగష్టు 20 :భారత-జపాన్ రక్షణ, విదేశాంగ శాఖ మంత్రుల మధ్య న్యూఢిల్లీలో 2024 ఆగస్టు 20న మూడో దఫా ద్వంద్వ మంత్రుల స్థాయి (2+2) చర్చలు సాగనున్నాయి. ఈ మేరకు జపాన్ రక్షణ మంత్రి శ్రీ కిహర మినొరు, విదేశాంగ శాఖ మంత్రి యొకొ కామికవతో భారత రక్షణ/విదేశాంగ శాఖల మంత్రులు శ్రీ రాజ్‌నాథ్ సింగ్, డాక్టర్ ఎస్.జైశంకర్ సమావేశమవుతారు. ఈ చర్చల కార్యక్రమంలో భాగంగా రెండు దేశాల రక్షణశాఖ మంత్రుల మధ్య ద్వైపాక్షిక సమావేశం కూడా ఉంటుంది.

ఈ ద్వంద్వ మంత్రులు స్థాయి చర్చల్లో భాగంగా రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేపట్టే మార్గాన్వేషణ చేస్తారు. అలాగే ద్వైపాక్షిక సహకారంపైనా సమీక్షిస్తారు. అంతేకాకుండా ఉభయతారక ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలు పంచుకుంటారు.

ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం, చట్టబద్ధ పాలన సహిత ఉమ్మడి విలువల ప్రాతిపదికగా భారత-జపాన్ మధ్య 'ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యం' కొనసాగుతోంది. అందులో అత్యంత కీలకమైన రక్షణశాఖ ఒక మూల స్తంభంగా ఉంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, సార్వజనీన, స్వావలంబిత ఇండో-పసిఫిక్ ప్రాంతీయ ఆవిష్కారానికి హామీ దిశగా భారత్-జపాన్ రక్షణ సంబంధ భాగస్వామ్యాన్ని ఇంకా శక్తిమంతమైనదిగా రూపొందించడం చాలా ముఖ్యం.

ఈ నేపథ్యంలో ప్రస్తుత ద్వంద్వ మంత్రుల స్థాయి సమావేశం రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు రెండు దేశాల మధ్యగల ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని కూడా విస్తృతం చేస్తుంది. కాగా, భారత్-జపాన్ ద్వంద్వ మంత్రుల స్థాయి రెండో దఫా చర్చల కార్యక్రమాన్ని 2022 సెప్టెంబరులో జపాన్‌లో నిర్వహించారు.



జగన్ హయాంలో ఏ శాఖలో చూసినా అవినీతే.. బుద్ధా వెంకన్న

అమరావతి, ఆగష్టు 20 : రాష్ట్రంలో ఏ శాఖనూ వదిలిపెటకుండా జగన్ ఆధ్వర్యంలోని దండుపాలెం బ్యాచ్ మొత్తం దోచుకుందని తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర ఇన్చార్జ్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఆరోపించారు. ప్రస్తుతం వారు చేస్తున్న అరాచకాలు బయట పడుతున్నందునే ఎక్కడికక్కడ ఫైర్ల దహనానికి ఒడిగడుతున్నారని విమర్శించారు. జగన్ ను చూసి ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్న ఆయన ప్రస్తుతం చంద్రబాబు ఉన్నందునే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కూటమి ఆధ్వర్యంలో ప్రస్తుతం ప్రజాపాలన జరుగుతోందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై చర్చిం చేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.విజయవాడలోని పశ్చిమ నియో జకవర్గంలో ఉన్న తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల్లో అవినీతి చేశారు కాబట్టే.. వివిధ శాఖల్లో ఫైళ్లను తగులబెడుతున్నారని ఆరోపీ ంచారు. అడ్డగోలుగా నియామకాలు, కాంట్రాక్టర్లు కట్ట పెట్టవేల కోట్ల రూపాయలు దోచుకున్నారని చెప్పారు. వైసీపీ నేతలు, కొంతమంది అధికారు లు కుమ్మక్కై ఉమ్మడిగా దోపిడీకి తెర లేపారన్నారు. దమ్ముంటే పట్టుకోండి అని ఇప్పుడు సిగ్గు లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని, వైసీపీ పాలనలో ఉన్న పరిశ్రమలు కూడా వెళ్లిపోయాని, జగన్ ను చూసి భయ పడి.. ఒక్కరూ కూడా ఏపీకి రాలేద న్నారు.ఇప్పుడు చంద్రబాబును చూసి పెట్టుబడిదారులు మళ్లీ ఏపీకి వస్తున్నా రన్నారు. తాము చేసిన ప్రయత్నాల వల్ల ఇప్పుడు పరిశ్రమలు వస్తున్నాయని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్న ఆయన జోగి రమేష్ భూబాగోతం చూశామని, అటాచ్ ఆస్తులను కూడా స్వాహా చేశారన్నారు. వైసీపీ పాలనలో అన్నీ అక్రమాలు, అరాచకాలే జరిగాయ న్నారు. జగన్ పెద్ద పెద్ద దోపిడీలు చేశారని, ఆయన అడుగు జాడల్లో ఆపా ర్టీ నేతలు అందినకాడికి దోచుకున్నా రన్నారు. పలానా శాఖలో తాము దోచుకోలేదని చెప్పే దమ్ము ధైర్యం ఉందా అని ప్రశ్నించిన ఆయన, ఏ శాఖ పేరు చెప్పినా.. తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అసలు ప్రభుత్వ శాఖల్లో కీలక ఫైళ్లు దగ్గం ఏమిటో వింతగా ఉందన్నారు.ఎవరికీ అర్థం కాని జగన్ ఆర్డ్ ఇది.. దొరక్కుండా తగులబెడుతున్నారన్నారు. చేసిన అవినీతి బయట పడకుండా ఉండాలని ఈ ఫైళ్లు దగ్గం చేస్తున్నారని, గతంలో వైయస్ హయాంలో అనేక మంది అధికారులు జైలుకు వ

జిల్లాలో భారీ వర్షం నమోదు..

-పలుచోట్ల పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
-హంద్రీ నదికి భారీగా వరద
-కోసిగిలో చెరువుకు గండి
-రూ.20లక్షల పంట నీళ్ల పాలు

అమరావతి, ఆగష్టు 20 :కర్నూలు జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం మధ్య పశ్చిమ ప్రాంతంలో భారీ వర్షాలు నమోదయ్యాయి. దీంతో జిల్లాలో అనేకచోట్ల వాగులు, వంకలు,

పొంగిపొర్లుతున్నాయి. చాలా గ్రామాలకు రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ముఖ్యంగా వేదవతి పొంగిపొర్లడంతో కర్నూలు, బళ్ళారి రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. కోసిగిలో చెరువుకు గండిపడంతో సుమారు రూ.20లక్షల పంట నీళ్ల పాలైంది.

తీవ్ర నష్టం వాటిల్లింది. హ్వాళగుంద మండల పరిధిలోని హగరి, వేదవతి నదిపై పొంగిపొర్లుతున్న వరద నీరు.. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కౌతాళం మండలంలో రాత్రి భారీ వర్షం మూలంగా ఉపరాల్ గ్రామంలో వంకలు భారీగా పొంగిపొర్లుతున్నాయి. పత్తికొండలో భారీ వర్షం చిన్నహుల్తిలో హంద్రీ నిండుకుండలా పారుతూ గాజులదిన్నె ప్రాజెక్టుకు భారీగా వరదనీరు తరలివెళ్తుంది.

పశ్చిమ ప్రాంతంలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి..,మంత్రాలయం మండలంలో 189.8 మి.మీ, కోసిగి- 96.2, కౌతాళం- 66.4, పెద్దకడుబూరు- 55.6, ఆదోని 48.2, గోనెగండ్ల- 44.2, హ్వాళగుంద- 42.8, నందవరం- 14.6, యెమ్మిగనూరు- 9.6, డివిజన్ మొత్తం 567.4 మి.మీ నమోదైంది. వాస్తవంగా డివిజన్ సగటు వర్షపాతం 63.0 మి.మీ కావడం విశేషం.

స్థానిక ఎన్నికలలో నిబంధన ఎత్తివేత..

-ఇద్దరు పిల్లలు కంటే ఎక్కువున్నా ఇక పోటీకి అర్హత
-వెల్లడించిన ఎపి సిఎం చంద్రబాబు
-పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖలపై
-ఉప ముఖ్యమంత్రి పవన్ తో కలసి సమీక్ష
-వేడుకల వ్యయాన్ని పెంచుతున్నట్లు ప్రకటన
-గౌరవ వేతనం పెంపుపై చర్చలు

అమరావతి, ఆగష్టు 20 : గ్రామ పంచాయతీలకు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల వ్యయం పెంచాలని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు.. ఈ వేడుకల వ్యయాన్ని రూ.10 వేల నుంచి 25

వేలకు పెంచినట్టు ప్రకటించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్ష సమావేశం చంద్రబాబు నిర్వహించారు.. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సమీక్షలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హత నిబంధన ఎత్తివేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు వెల్లడించారు. దీనిపై కేబినెట్ లో చట్ట సవరణ బిల్లు కూడా ఆమోదించినట్టు తెలిపారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు గౌరవ వేతనం పెంపు అంశం కూడా నేటి సమీక్ష సమావేశంలో చర్చకు వచ్చింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది.

కాగా, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం నిర్వహణకు ప్రత్యేక మొబైల్ యాప్ తీ రూపొందించి, దాని ద్వారా గ్రామీణ పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షిస్తున్నట్టు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇక, ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు పవన్ సీఎం చంద్రబాబుకు వివరించారు. 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

-ఇంద్రకీలాద్రిపై మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా
-ప్రత్యేక హోమాలు, అర్చనలు, పూజలు

అమరావతి, ఆగష్టు 20 :ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత ప్రాచుర్యం కలిగిన విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మూడు రోజులపాటు అత్యంత వైభవంగా పవిత్రోత్సవాలను నిర్వహించారు. ఈనెల 18వ తేదీ ఆదివారం నుండి ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు మంగళవారం పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిసాయి. కవిత్వ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక హోమాలు, పూజలు సాంప్రదాయ బద్ధంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. పవిత్రోత్సవముల చివరిరోజు ఆలయ కార్యనిర్వాహనాధికారి కె.ఎస్ రామరావు సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణాల నడుమ వైదిక సిబ్బంది, అర్చకులచే మండపారాధన పూజలు, సర్వప్రాయశ్చిత్త విధి తత్తత్ శాంతిక పౌష్టిక హోమములు, కూష్మాండ బలి నిర్వహించిన అనంతరం పూర్ణహుతి కార్యక్రమం నిర్వహించారు.

తదుపరి కళాశోద్వాసన, మార్జన చేసి అందరికీ మహాదాశీర్వచనం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహనాధికారి కె ఎస్ రామరావు దంపతులు పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైదిక, అర్చక సిబ్బంది, వేదపండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఆలయ ఈవో మాట్లాడుతూ దేవస్థానంలో 3 రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవములు పూర్ణహుతి కార్యక్రమంతో దిగ్విజయంగా ముగిసినవని తెలిపారు.

ఈనెల 23న దేవస్థానంలో సామూహిక వరలక్ష్మి వ్రతములు ఉదయం 07 గం. లకు ఆర్జిత సేవగాను, అనంతరం 11 గం. లకు ఉచితముగాను నిర్వహించడం జరుగుచున్నదని, ఉచిత వ్రతం కోసం దేవస్థానం కార్యాలయంలో భక్తులు అప్లికేషన్లు పొందుచున్నారని తెలిపి, అందరూ ఈ అవకాశమును వినియోగించుకొని, అమ్మవారి అనుగ్రహం పొందగలరని తెలిపారు.

ఆర్మీ స్టాఫ్ మాజీ చీఫ్ జనరల్ ఎస్ పద్మనాభన్ మృతికి భారత సైన్యం సంతాపం

న్యూఢిల్లీ, ఆగష్టు 20 :ఆర్మీ స్టాఫ్‌కి 20వ చీఫ్‌గా పనిచేసిన జనరల్ సుందరరాజన్ పద్మనాభన్ (రిటైర్డ్) మృతికి భారత సైన్యం ప్రగాఢ సంతాపం తెలిపింది. ఆయన కుటుంబ సభ్యులకు ఆర్మీ స్టాఫ్ చీఫ్, జనరల్ ఉపేంద్ర ద్వివేదితో సహా భారత సైన్యంలో అన్ని ర్యాంక్‌లకు చెందిన అధికారులు సానుభూతి తెలియజేశారు.

ఆదర్శవంతమైన నాయకత్వం, జాతి పట్ల అంకిత భావం కలిగిన జనరల్ పద్మనాభన్ దీర్ఘకాలిక అనారోగ్యంతో 83ఏళ్ల వయసులో చెన్నైలో ఆదివారం రాత్రి కన్నుమూశారు.

కేరళలోని తిరువనంతపురంలో డిసెంబర్ 5, 1940న జన్మించిన జనరల్ పద్మనాభన్ డెహ్రాడూన్ లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాల (ఆర్ఐఎంసీ), ఖడక్వాసాల్లోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీయే)ల్లో విశిష్ట పూర్వ విద్యార్థి. శతఘ్నిదళం రెజిమెంట్ లో డిసెంబరు 13, 1959న చేరి నాలుగు దశాబ్దాలకు పైగా కెరీర్ ను కొనసాగించారు.

జనరల్ పద్మనాభన్ తన సర్వీసులో కమాండ్, సిబ్బంది, నియామకాల్లో కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారు. గజాలా ఫీల్డ్ రెజిమెంట్, రెండో పదాతిదళ బ్రిగేడ్, శతఘ్ని దళానికి నాయకత్వం వహించారు. మేజర్ జనరల్‌గా, పశ్చిమ సెక్టార్‌లో పదాతిదళ విభాగానికి, లెఫ్టినెంట్ జనరల్‌గా కాశ్మీర్ లోయలో సాయుధ దళానికి నేతృత్వం వహించి ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో కీలక పాత్ర పోషించారు.

సెప్టెంబర్ 1, 1996న జనరల్ పద్మనాభన్ ఉత్తర కమాండ్ విభాగంలో కమాండింగ్- ఇన్-చేఎట్టారు. ఆర్మీ స్టాఫ్ చీఫ్ గా ఆయన అక్టోబర్ 1, 2000న బాధ్యతలు చేపట్టారు.

సహోద్యోగులు "ప్యాడీ" అని ఆప్యాయంగా పిలుచుకునే జనరల్ పద్మనాభన్ సైనికుల సంక్షేమం, భారత సైన్య ఆధునికీకరణ, వ్యూహాత్మక అంశాలపై దృష్టి సారించారు. ఆయన రాష్ట్రపతికి గౌరవ ఏడీసీ కూడా. 'ఆపరేషన్ పరాక్రమ్' చేపట్టిన కీలక సమయంలో భారత సైన్యానికి జనరల్ పద్మనాభన్ నాయకత్వం వహించారు. 43 ఏళ్లు ఆదర్శవంతంగా సేవలు అందించిన అనంతరం డిసెంబర్ 31, 2002న పదవీ విరమణ చేశారు. ఆయన మరణం దేశానికి, భారత సైన్యానికి తీరని లోటు.

జనరల్ పద్మనాభన్ అచంచలమైన అంకితభావం, జాతీయ భద్రతకు చేసిన కృషిని దేశం గుర్తుంచుకుంటుంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి.

పోలవరం దస్త్రాల దగ్ధం .. నలుగురు అధికారుల సస్పెన్షన్

అమరావతి, ఆగష్టు 20 :ధవళేశ్వరం: తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయం దస్త్రాల దగ్ధం కేసులో ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. సీనియర్ అసిస్టెంట్లు కె. నూకరాజు, కారం బేబీ, స్పెషల్ అస్ఐ కళాజ్యోతి, సబార్డినేట్ రాజశేఖర్ను జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సస్పెండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్లు ఎ. కుమారి, ఎ. సత్యదేవికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్య వైఖరిని ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

కూలిన ఎల్బీ స్టేడియం ప్రహరీ గోడ.. పలు వాహనాలు ధ్వంసం

హైదరాబాద్, ఆగష్టు 20 :నిన్న రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి నగరం తడిసి ముద్దయింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగిపొర్లాయి. భారీ వర్షానికి ట్రాఫిక్ స్తంభించిపోయింది. రాంనగర్‌లో ఓ ద్విచక్ర వాహనదారుడు వరదలో కొట్టుకుపోయాడు. వరదలో కొట్టుకుపోయిన మరో కూలి మృతి చెందాడు. కాగా, నిన్నటి నుంచి కురుస్తున్న వర్షానికి ఎల్బీ స్టేడియం ప్రహరీ గోడ కూలిపోయింది. బషీర్ బాగ్ సీసీఎస్ పాత కార్యాలయానికి అనుకోని ఉన్న గోడ కూలడంతో అక్కడే పార్క్ చేసిన పోలీస్ వాహనాలు ధ్వంసమయ్యాయి. గోడ కూలే సమయంలో ఎవరు లేకపోవడం పెను ప్రమాదం తప్పింది.

మరోవైపు జీహెచ్ఎంసీ పరిధిలోని విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. భారీ వర్షం కారణంగా స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల డీఈవోలు ఆదేశాలు జారీచేశారు. కాగా, పంజాగుట్టలోని అపార్టమెంట్ నుఖ్ నివాన్ అపార్టుమెంటు వద్ద పిడుగుపడింది షెడ్డుపై పిడుగు పడి కారు ధ్వంసమయింది. దీంతోపాటు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రజలు అవసరమైతేనే తప్ప బయటకు రాకూడదని హెచ్చరించారు.

ఆర్టికల్ 370 పునరుద్ధరణ

-జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టో

జమ్ము కశ్మీర్ ఆగష్టు 120 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కీలక హామీలతో నేషనల్ కాన్ఫరెన్స్ తన ఎన్నికల మేనిఫెస్టోను సోమవారం విడుదల చేసింది. మేనిఫెస్టోలో 12 గ్యారంటీలకు చోటు కల్పించింది. ఆర్టికల్ 370 పునరుద్ధరణ, 35-ఏ, రాష్ట్ర హోదా వంటి భారీ హామీలను గుప్పించింది. నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు .కశ్మీరీ పండిట్లను తిరిగి రప్పించి వారికి పునరావాసం కల్పిస్తామని పేర్కొంది. కేంద్రపాలిత ప్రాంతంలో రాజకీయ, చట్టబద్ధ స్థితిని పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో తొలి గ్యారంటీగా పేర్కొంది. ఆర్టికల్ 3701, 35ఏ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చింది. రాజకీయ ఖైదీల విడుదల, కశ్మీరీ పండిట్ల పునరావాసం, జాబ్ వెరిఫికేషన్ ప్రక్రియ సులభతరం, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ సరళీకరణ సహా పలు హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచింది. యువతకు సమగ్ర ఉపాధి ప్యాకేజ్ ప్రకటిస్తామని మూడో గ్యారంటీగా పేర్కొంది. ఇక 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామని ఒమర్ అబ్దుల్లా హామీ ఇచ్చారు. మంచినీటి సరఫరా, విద్యుత్ పంపిణీలో సమస్యలను అధిగమిస్తామని తెలిపింది.

ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ ఉద్యోగులతో రక్షాబంధన్ వేడుకల్లో కేంద్రమంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, ఆగష్టు 20 :'రక్షా బంధన్' పర్వదినాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వశాఖ కార్యాలయంలోని మహిళా ఉద్యోగులందరూ ఆయనకు రాఖీ కట్టాలని పిలుపునిచ్చారు. దీంతో మంత్రిత్వ శాఖ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు ఆనందంలో మునిగిపోయారు.

మంత్రిత్వ శాఖ అధికారులతో పాటు సాగర్‌మాల డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ), మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న యంగ్ ప్రొఫెషనల్స్ ఇతర ఉద్యోగులు కూడా గౌరవ మంత్రికి రాఖీ కట్టారు.

రాఖీ పర్వదినం రూపంలో అందరూ ఒకే కుటుంబంగా జరుపుకుంటున్న ఈ సోదర సోదరీమణుల అందమైన బంధాన్ని

పంచుకోవడం పట్ల శ్రీ సర్బానంద సోనోవాల్ సంతోషం వ్యక్తం చేశారు. మంత్రికి రాఖీ కట్టిన ఒక మహిళా ఉద్యోగి మాట్లాడుతూ, కేంద్రమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం గొప్పదని.., దీనిని అన్ని విభాగాలకు కూడా విస్తరించవచ్చని అన్నారు. తన సొంత సోదరుడు విదేశాల్లో ఉన్నందున రాఖీ కట్టడానికి మంత్రిలో తనకు ఒక సోదరుడు దొరకడం శుభపరిణామమని మరో ఉద్యోగి తన ఆనందాన్ని పంచుకున్నారు.

రక్షా బంధన్ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి వేడుకల ద్వారా మంత్రిత్వ శాఖ ఒక కుటుంబంగా మారి, బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని సోనోవాల్ తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

హాస్టల్స్‌కు బయటి ఆహారాన్ని అనుమతించకూడదు.. కలెక్టర్ ఆదేశం

శ్రీకాకుళం, ఆగస్టు 20: జిల్లాలో నడుపుతున్న హాస్టల్స్ కు బయటి నుండి ఆహారం అనుమతించకూడదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ వసతి గృహాలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న బాలల రక్షిత గృహాలు, హాస్టల్స్ నడుపుతున్న యాజమాన్యాలతో ఆయన సమావేశం నిర్వహించారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్ లలో చదువుకుంటున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యాశాఖ విద్యార్థులకు అక్షయపాత్ర నుండి ఆహారం వస్తుందని డీఈఓ కృష్ణ చైతన్య వివరించారు. స్టోరేజ్ చేసిన తాగునీరు వినియోగించకూడదని చెప్పారు. ఆర్.ఒ.ప్లాంట్ ఉండేటట్టు చూడాలన్నారు. ఫ్రూట్, కూరగాయలు ఫ్రెస్ గా ఉండాలన్నారు. 500 దాటిన వారికి ప్రత్యేక అధికారి ఉండాలని చెప్పారు. 500 లోపల ఉన్న హాస్టళ్లకు కింద స్థాయి అధికారి ప్రత్యేక అధికారి ఉండాలన్నారు. సెక్యూరిటీ ఉండాలని చెప్పారు.

డోనర్స్ ద్వారా ఆహారం సరఫరా చేస్తున్నది లేనిది ఆయన ఆరా తీశారు. బయటి నుంచి ఆహారం తీసుకోకూడదని చెప్పారు. కాలేజీ అటాచ్ హాస్టల్ ఉంటేనే నడపాలని వెనకబడిన సంక్షేమ అధికారి

అనూరాధకు కలెక్టర్ ఆదేశించారు. మండల, జిల్లా కేంద్రాల్లో ఉన్న హాస్టళ్లను గుర్తించాలన్నారు. పీహెచ్ నీ వైద్యులకు ట్యాగ్ చేయాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ఎక్స్పైరీ డేట్ చూసుకోవాలని చెప్పారు. ఆహారం కలుషితం కాకుండా చూడాలన్నారు. కిచెన్ వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ? వాటర్ ట్యాంక్ క్లీనింగ్ చేయాలని, బయటి నుంచి ఆహారం తీసుకోకూడదని చెప్పారు. మసాలాలకు రంగు వేస్తున్న నేపథ్యంలో బయటి ఆహారం తీసుకోకూడదని తెలిపారు. బయటి ఫుడ్ పొల్యూషన్ అవుతుందని వివరించారు. ఎక్స్పైరీ డేట్ అయిపోతే పారవేయాలని ఆహార భద్రతా అధికారి జి.శ్రీరాములు చెప్పారు. సహాయ భద్రత నియంత్రణాధికారి వెంకటరత్నం 9704009989 నంబర్ కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

అనంతరం హాస్టల్స్ నడుపుతున్న యాజమాన్యాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిశ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టళ్లలో మెనూ బయట డిస్ప్లే చేయాలన్నారు. బయటి నుండి ఫుడ్ తీసుకోకూడదని చెప్పారు. పాత హిస్టరీని పరిశీలించి సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. వరినరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. సందర్శకుల రిజిష్టర్ ఉండాలని తెలిపారు. బీసీ సంక్షేమ అధికారి అనూరాధ, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ, డీఎంహెచ్ఓ, రెసిడెన్షియల్ స్కూల్ కో ఆర్డినేటర్, తదితరులు పలు సూచనలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, సాంఘీక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, జిల్లా రెసిడెన్షియల్ స్కూల్స్ కో ఆర్డినేటర్ బాలాజీ నాయక్, ఆర్బఐ దుర్గారావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ శ్రీలక్ష్మీ, ప్రొటెక్షన్ జిల్లా అధికారి రమణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ శ్రీలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఫైబర్ నెట్ మాజీ ఎండీ మధుసూదన్ రెడ్డిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు

అమరావతి ఆగష్టు 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స);ఫైబర్ నెట్ మాజీ ఎండీ మధుసూదన్ రెడ్డిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఆయనపై ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు రికార్డులను తారుమారు చేసేందుకు ప్రయత్నించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులను నియమించినట్లు ఆరోపణలున్నాయి. సాక్ష్యాధారాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జీవో విడుదల చేసింది. ఆయన కేంద్ర సర్వీస్ నిబంధనలు ఉల్లంఘించారని.. ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ప్రభుత్వం ఆరోపించింది. ఇక మధుసూదన్‌రెడ్డిని హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లొద్దని సదరు జీవోలో స్పష్టం చేసింది.అయితే, ఫైబర్ నెట్‌లో అక్రమాలకు సంబంధించి కేసు విచారణ జరుగుతున్నందున మధుసూదన్ రెడ్డి అందుబాటులో ఉండడం అవసరమని.. ఈ మేరకు ఆయన డిప్యూటేషన్‌ను మరో ఆరు నెలలు పొడిగించాలని ఏపీ సర్కారు రైల్వే బోర్డుకు రాసిన లేఖలో విజ్ఞప్తి చేసింది. వాస్తవానికి ఏపీలో మధుసూదన్‌రెడ్డి డిప్యూటేషన్ ఈ నెల 22తో ముగియనున్నది. ఆయన 2019 ఆగస్టు 26న రైల్వే అకౌంట్స్ సర్వీస్ నుంచి ఏపీకి డిప్యూటేషన్‌పై వచ్చారు. ప్రస్తుతం ఫైబర్ నెట్‌లో అక్రమాలపై విచారణ నేపథ్యంలో ఆయనపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విచారణ విషయాన్ని బోర్డు దృష్టికి తీసుకెళ్లింది. అలాగే, ఏపీఎండీసీ మాజీ ఎండీ వెంకట్‌రెడ్డి డిప్యూటేషన్‌ను పొడిగిస్తూ భారత కోస్ట్‌గార్డ్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఏపీ సర్కారుకు లేఖ అందింది.వెంకట్‌రెడ్డిపై సైతం అవినీతి ఆరోపణలపై విచారణ జరుగుతున్నది. ఏపీ ప్రభుత్వం రాసిన లేఖ మేరకు ఈ నెల 31 వరకు ఆయన డిప్యూటేషన్‌ను పొడిగించినట్లు సీఎస్‌కు రాసిన లేఖలో కోస్ట్‌గార్డ్ కార్యాలయం తెలిపింది. ఈ విషయంలో కేంద్రానికి సైతం ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. సర్వీస్ నిబంధనల ఉల్లంఘనపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన ఈ నెల 31 పదవీ విరమణ చేయనున్నట్లు తెలిపింది. ఆ తర్వాత చర్యలు ప్రభుత్వమే తీసుకోవాల్సి ఉంటుందని సీఎస్‌కు రాసిన లేఖలో చెప్పింది. గనులశాఖలో అక్రమాలపై వెంకట్‌రెడ్డిని ప్రభుత్వం ఇటీవల సస్పెండ్ చేసిన విషయం విధితమే.

వాగులో కొట్టుకుపోయిన ఇద్దరు టీచర్ల కుటుంబాలకు ఉద్యోగాలు : ఏపీ మంత్రి సంధ్యారాణి

అమరావతి, ఆగష్టు 20 :పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 16న వాగులో కొట్టుకుపోయి చనిపోయిన ఇద్దరు టీచర్ల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఏపీ మంత్రి సంధ్యారాణి వెల్లడించారు.

సాలూరు మండలం సరాయివలస గ్రామంలో ఏకలవ్య పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్తి, వార్డెన్‌గా పనిచేస్తున్న మహేశ్ విధులు నిర్వహించుకుని తిరిగి వారు నివాసముంటున్న గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. వారు ఒట్టిగెడ్డవాగులో వాగును దాటే క్రమంలో ఇద్దరు ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఆర్తి మృతదేహం దొరకగా, మహేశ్ మృతదేహం మరునటి రోజు లభించింది. వీరిద్దరూ మృతి చెందడం పట్ల ఏపీ ప్రభుత్వం స్పందించి



మృతదేహాలను అంబులెన్స్‌లో స్వస్థలమైన హర్యానకు పంపింది.

ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మంగళవారం మాట్లాడుతూ ఘటనలో మృతి చెందిన వీరిద్దరి కుటుంబాలకు ఉద్యోగం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కేంద్రం రూ. 10 లక్షలు, రాష్ట్రం రూ. 5 లక్షలు మృతుల కుటుంబాలకు అందజేస్తామని, ఎలాంటి సాయమడిగినా ఇవ్వాలని సీఎం ఆదేశించారని ఆమె వెల్లడించారు.

రైతులకు రుణమాఫీ చేసేంత వరకు పోరాడుతాం : మాజీ మంత్రి ఎర్రబెల్లి

జనగామ, ఆగష్టు 20 : రుణమాఎ ఎగ్గొట్టి రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో రుణమాఫీ కాలేదని ఆరోపిస్తూ రైతులు బ్యాంక్ ఎదుట చేపట్టిన ధర్నాకి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మొదటగా రైతు రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరం అని చెప్పి మాట మార్చింది. చివరికి రూ.17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందని మండిపడ్డారు.

రుణమాఫీ కాక ఆందోళనలో ఉన్న లక్షలాది మంది రైతులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీనిచ్చారు. పాలకుర్తి నియోజకవర్గంలో కనీసం పంట పండించుకునేందుకు రైతులకు సాగునీరు కూడా అందియలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం దిగివచ్చి పూర్తిగా రుణమాఫీ చేసి రైతులకు సాగునీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. కనీసం 40 శాతం కూడా రుణమాఫీ కాకముందే రుణమాఫీ అయిపోయిందని సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు.

రైల్లోంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

హైదరాబాద్, ఆగష్టు 20 : రైల్లోంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మౌలాలి-లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్యన గుర్తు తెలియని ఓ వ్యక్తి రైల్లోంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.

సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు సూమారు (35) సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రైతు రుణమాఫీపై నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు..

ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

హైదరాబాద్, ఆగష్టు 20 :రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 22వ తేదీన అన్ని మండల కేంద్రాలు/నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ తరఫున ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతన్నలు కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ ప్రయోజనం పొందకపోవడంతో ఆందోళన చేస్తున్నారని అన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే.. మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని.. కార్యక్రమం కొనసాగుతుందని చెబుతున్నారని అన్నారు. ఎవరికీ తోచిన విధంగా వారు మాట్లాడుతూ రైతన్నలను అయోమయానికి, ఆవేదనకు గురిచేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

ఎన్నికలకు ముందు రెండు లక్షల వరకు రుణమాఫీని అందరికీ వర్తింపజేస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఎన్నికలు కాగానే రైతు రుణమాఫీ కోసం రూ. 40 వేల కోట్ల రూపాయలు అవసరమని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారని.. కానీ కేబినెట్ మాత్రం కేవలం 31 వేల కోట్లకు మాత్రమే అనుమతిచ్చిందని అన్నారు. ఇక బడ్జెట్‌లో 26 వేల కోట్లకు మాత్రమే ఆమోదం తెలిపి రైతులను మోసం చేశారని తెలిపారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ. 26 వేల కోట్లలో నుంచి కేవలం 18 వేల కోట్ల రూపాయలే ఖర్చు చేసి రైతులను నిలువునా ముంచినట్లు తీవ్రంగా మండిపడ్డారు.

రైతు రుణమాఫీ జరగక ఆందోళన చేస్తున్న రైతులకు అండగా ఉండాల్సింది పోయి.. మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను మరింత గందరగోళానికి గురిచేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం 40% మంది రైతులకు కూడా రుణమాఫీ లబ్ధి చేకూరలేదని, క్షేత్రస్థాయి నుంచి తమకు సమాచారం అందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి కారణంగా లక్షలాది మంది రైతన్నలు రోజు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీని వెంటనే చేయాలని, ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. డిసెంబర్ 9లోగా రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఆ తర్వాత ఆగస్టు 15 అంటూ మరోసారి మాట తప్పారని మండిపడ్డారు. అడ్డగోలు ఆంక్షలు పెట్టి రైతులకు రుణమాఫీ అందకుండా చేసిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. లక్షలాది మంది రైతన్నలకు అండగా ఉండేందుకు ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువచ్చేందుకే ఈనెల 22వ తేదీన అన్ని మండల కేంద్రాలతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతన్నలకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ అందే వరకు భారత రాష్ట్ర సమితి తరఫున ప్రభుత్వంపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్..

వరంగల్, ఆగష్టు 20 :అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. డోర్నకల్ సీఐ బి.రాజేష్, ఎస్ఐ, సిబ్బంది ఆర్.సైదులు, సూర్యనారాయణ హెడ్ కానిస్టేబుల్ తో కలిసి మంగళవారం డోర్నకల్ పట్టణ కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ బొమ్మ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఒక ట్రాలీ వాహనం పోలీసు వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా.. పోలీసులు ఆ వాహనాన్ని పట్టుకుని విచారించారు. ఆ వాహనంలో రెండు మోటార్లు, రెండు స్కూటీలు ఉండగా.. తదుపరి విచారణలో వాళ్లు గత నాలుగు నెలల నుండి వివిధ ప్రాంతాల్లో కరెంట్ మోటార్ లు, ఇనుప వస్తువులు దొంగతనాలు చేస్తున్నట్లు తెలుపగా.. పోలీసులు వారి వద్ద నుండి ముందుగా 2 మోటర్లు, 2 స్కూటీ బైక్ లు, ఓ వాహనం ట్రాలీ, రూ.70,000 వేలను నిందితుడు ఏ5 తేజావత్ జవహర్లాల్ ఇంటివద్ద మొత్తం 19 మోటార్ లు స్వాధీన పరుచుకున్నారు.

మామిళ్లగూడెం ఖమ్మంకి చెందిన వీరబోయిన ముత్యాలు, కొట్టే గణేష్, తేజావత్ సదర్ లాల్, రఘునాథపాలెం మండలం వేపకుంట్లకు చెందిన మొగిలి నాగరాజు, గానుగపాడు విలేజ్ చంద్రుగొండ మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇస్లావత్ సిద్దూ, పువ్వాడ ఉదయం నగర్ కాలనీ రఘునాథపాలెం మండలం తేజావత్ జోహార్ లాల్. వీరిలో మొగిలి నాగరాజుపై ఖమ్మం 3 టౌన్ పీఎస్ లో కేసు నమోదైంది. తేజావత్ సోదరులాల్ పై కొనిజర్ల పీఎస్ లో కేసు నమోదైంది. వీరబోయిన ముత్యాలుపై ఖమ్మం రూరల్ పీఎస్ లో ఒక కేసు నమోదైంది. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

19 బావి ఎలక్ట్రిక్ మోటార్లు, టీఎస్ 04 యుడి 7897 నెంబర్ గల ఓ వాహనం ట్రాలీ, నెంబర్ లేని స్కూటీ, టీఎస్ 04 ఈం 8726, 70,000/- నగదును పట్టుకున్నారు. పైన తెలిపిన నిందితులు సులువుగా డబ్బులు సంపాదించే ఉద్దేశంతో ఒక గ్యాంగ్ గా తయారై గత 4 నెలల నుండి మహబూబాబాద్ జిల్లాతో పాటు ఖమ్మం జిల్లాలో మొత్తం 19 మోటర్లు దొంగలించారు. టన్నున్నర ఐరన్ రాడ్లను కూడా దొంగతనం చేశారు.

ప్రధాన నిందితురాలు ముత్యాలు మోటారు దొంగతనం చేయాలని తన స్నేహితురాలైన నాగలక్ష్మి ట్రాలీ వెహికల్ ను కిరాయికి తీసుకొని పైన నిందితులతో కలిసి దొంగతనానికి పాల్పడుతున్నారు. అటు మోటార్లను ఖమ్మం పువ్వాడ ఉదయ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న తేజావత జవహర్లాల్ ఇంటి వద్ద దాచి ఉంచి, 10రోజుల క్రితం చోరీకి పాల్పడిన మోటర్లను ఆరోజు ఎవరో వెంటపడుతున్నట్లు అనిపించి డోర్నకల్ మండలంలోని సమ్మక్క సారక్క దేవాలయం పక్కన చెట్ల పోదల్లో దాచిపెట్టి వాటిని తీసుకొని వెళ్ళుటకు రాగా దొంగలను పట్టుకోవడం జరిగిందని ఎస్పీ రామ్నాథ్ కేకన్ మీడియా సమావేశంలో తెలిపారు.

నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న సొత్తు..

మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్ మండలంలో మొత్తం ఏడు మోటార్లు టన్నున్నర ఇనుప రాడ్లు, కురవి మండలం రెండు మోటార్లు, నర్సింహులుపేట మండలంలో ఒక మోటర్. ఖమ్మం జిల్లా నుండి రఘునాథపాలెం మండలంలో ఐదు మోటార్లు, చింతకాని మండలంలో రెండు మోటార్లు, తల్లాడ మండలంలో ఒక మోటారు, ఖమ్మం రూరల్ పరిధిలో ఒక మోటారును దొంగలించారని, వీటి మొత్తం విలువ సుమారు 4,54000 ఉంటుందని ఎస్పీ రామ్నాథ్ కేకన్ తెలిపారు. అనంతరం చోరీకి పాల్పడిన మోటార్లను, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉన్న వివిధ వాహనాలను పరిశీలించి, పలువురు పోలీస్ సిబ్బందికి రివార్డు అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ తిరుపతి, స్థానిక ఎస్సైలు, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఆగస్టు 27, 28 తేదీల్లో ఆర్జిత సేవలు రద్దు

తిరుపతి, ఆగష్టు 20 : ఈనెల 27న శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానాన్ని నిర్వహించనున్నామని టీటీడీ అధికారులు తెలిపారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు బంగారు సర్వభూపాల వాహనంపై కృష్ణస్వామివారిని వేంచేపు చేసి నివేదనలు సమర్పిస్తామన్నారు.

ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, కృష్ణస్వామి వారికి ఏకాంత తిరుమంజనం నిర్వహించి , ద్వాదశారాధనం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఆగస్టు 28న ఉట్లోత్సవం సందర్భంగా సాయంత్రం 4 గంటలకు మలయప్పస్వామివారిని బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామివారిని మరో తిరుచ్చిపై తిరుమాడ వీధులలో ఊరేగింపు ఉంటుందని వివరించారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆగష్టు 28న శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలైన బ్రహ్మోత్సవంసహస్రదీపాలంకార సేవలను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల లొల్లి అందుకోసమే ..

కరీంనగర్, ఆగష్టు 20 : రైతు రుణమాఫీ, ఆరు గ్యారంటీ స్కీమ్‌ల హామీలపై చర్చను మళ్లించడానికే కాంగ్రెస్,బీఆర్ఎస్ విగ్రహాల లొల్లి ముందుకు తీసుకు వచ్చాయని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్ ఆరోపించారు. కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజల దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్, బిఆర్ఎస్ సవాళ్లకు ప్రతి సవాళ్లు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అర్హులకు సరిగ్గా రుణమాఫీ లేక రైతులు సతమతం అవుతున్నారని.. 6 గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ రైతు రుణమాఫీ బోగస్ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు చేశారు.

29న గీతా ఫౌండేషన్ వార్షికోత్సవం

హైదరాబాద్, ఆగష్టు 20 :గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవాన్ని ఈ నెల 29న రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బైలూర్ యోగేశ్ ప్రభు తెలిపారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బైలూర్ యోగేశ్ ప్రభు మాట్లాడుతూ పెద్దల్లో జ్ఞానం, పిల్లల్లో చైతన్యం తీసుకురావడమే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.

ఇందులో భాగంగానే విష్ణు సహస్రనామం పారాయణం, భగవద్గీత పారాయణం శ్లోకాలపై విద్యార్థులకు పోటీలు, భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ, అర్చక సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో బనారస్ స్వామీజీ, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్, రామకృష్ణ చంద్రమౌళి, మనహర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..

వరంగల్, ఆగష్టు 20 :తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం జయశంకర్ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ కట్కూరి నరేందర్ మాట్లాడుతూ? సూర్యాపేట ప్రభుత్వ హాస్పిటల్ లో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న వసీంఖాన్ అనే ఉద్యోగి ఆదివారం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఆయన మృతికి నివాళులర్పించారు. గత మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్నాడని ప్రభుత్వం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులకు ప్రతి నెలా ఐదులోపు జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని, ఇలాంటి చావులకు తావు ఇవ్వకుండా ఉద్యోగుల జీతాలు ప్రతినెలా క్రమం తప్పకుండా ఇవ్వాలని నరేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వివేక్, హెడ్ నర్సు విజయకుమారి, రాష్ట్ర కార్యదర్శి కిషోర్, కవిత, రాజమౌళి, కృష్ణ, స్వామి, రమణ, కోమల, రాజేష్, రాజన్న, స్టాఫ్ నర్సులు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి : ఆమ్రపాలి

హైదరాబాద్, ఆగష్టు 20 : ప్రజావాణిలోవచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటఅధికారులను ఆదేశించారు. సోమవా రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి కమిషనర్ ఆమ్రపాలి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చి న అర్జీల పరిష్కారంపై ఆయా అధికారులు దృష్టి సారించాలన్నారు. జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు కమిషనర్ సూచించారు.

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 విన్నపాలు రాగా, టెలిఫోన్ ద్వారా 4 విన్నపాలను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే పరిష్కరిం చాలని సంబంధిత అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 30 విన్నపాలు వచ్చినట్లు అధికారులు చెప్పారు. అందులో కూకట్‌పల్లి జోన్‌లో 12, సికింద్రాబాద్‌లో 10, ఎల్బీనగర్‌లో నాలుగు, చార్మినార్ జోన్‌లో రెండు, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి జోన్‌లలో ఒకటి చొప్పున విజ్ఞప్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రుణమాఫీపై రేవంత్ దగా.. జగదీష్ రెడ్డి

-రైతన్నలకు క్షమాపణ చెప్పాల్సిందే
-సగం మందికి కూడా రుణ మాఫీ కాలేదు
-పూర్తి చేశామంటున్న రేవంత్ సీఎం పదవికి రాజీనామా చేయాల్సిందే
-డిమాండ్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 20 :రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసినందుకు రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని, వారికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి. రుణమాఫీపై ఒక్కో మంత్రి ఒక్కోవిధంగా మాట్లాడుతున్నారని ఫైరయ్యారు. రుణమాఫీ కాని రైతులు ఎక్కడ ఫిర్యాదు చేయాలో స్పష్టత లేదన్నారు. తమకేం తెలియదని అధికారులు, బ్యాంకు సిబ్బంది చెబుతున్నారని వెల్లడించారు. అసలు ఎంతమందికి మాఫీ చేస్తరు.. ఇప్పటివరకు ఎంతమందికి చేశారో చెప్పాలన్నారు. మిగిలిన వారికి ఏ తేదీలోగా మాఫీ చేస్తారో స్పష్టం చేయాలన్నారు.

తెలంగాణ భవన్ లో ఆయన ఇవాళ మీడియాతో మాట్లాడుతూ అందరికీ రుణమాఫీ చేయలేదని మంత్రులే చెబుతున్నారన్నారు. బ్యాంకుల లెక్కప్రకారం 50లక్షల మందికిపైగా రైతులకు సంబంధించి రూ.49వేల కోట్లు రుణాలున్నాయని, అయితే మంత్రులు మాత్రం రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తామని చెప్పారు. ఇప్పటివరకూ రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్య స్పష్టంగా చెప్పట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా 15లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయాలని మంత్రి ఉత్తమ్ చెబుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి మాత్రం రైతులందరికీ రుణాలు మాఫీ చేశామంటూ డ్యాన్స్ చేస్తున్నారని విమర్శించారు. మరి ఇప్పుడు ముక్కు నేలకు రాయాల్సింది ఎవరని ప్రశ్నించారు.

ప్రతిపక్షంగా ఇంకా పని మొదలు కాలేదు ..

ప్రతిపక్షంగా ఇంకా తమ పని మొదలుపెట్టలేదని జగదీశ్ రెడ్డి అన్నారు. దగాపడ్డ రైతులే స్వయంగా రోడ్డెక్కుతున్నారని తెలిపారు. ఆందోళన చేస్తున్న రైతులను కేసులతో భయపెడుతున్నారని విమర్శించారు. రూ.2లక్షలకు మించి ఉన్న రుణం కడితేనే మాఫీ చేస్తామంటున్నారని, ప్రభుత్వం రూ.2లక్షలు మాఫీ చేస్తే మిగతావి రైతులే కట్టుకుంటారని వెల్లడించారు. రైతులపై దమనకాండకు పాల్పడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. రైతులకు అండగా తమ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. రుణమాఫీపై కాంగ్రెస్ సర్కార్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాజీవ్ విగ్రహం తొలగింపు ఖాయం ..

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినతర్వాత సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహం తొలగిస్తామని తేల్చి చెప్పారు జగదీష్ రెడ్డి. రాజీవ్ గాంధీకి తెలంగాణతో సంబంధం ఏంటని ప్రశ్నించారు.

అభినయశ్రీకి ఆర్థికసాయం చేసిన వేల్పుల విజేత

ఖమ్మం, ఆగష్టు 20 : (నేటినిజం ప్రతినిధి): ముదిగొండ కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చల్లగొండ అభినయశ్రీ కరాటే బ్లాక్ బెల్ట్ లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 30నుంచి సెప్టెంబర్ 9వరకు జరిగే అంతర్జాతీయ స్థాయిలో జరిగే కరాటే పోటీలకు నేపాల్ లో పాల్గొనేందుకు అభినయశ్రీ ఎంపిక కావడం జరిగింది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన అభినయశ్రీ అటు చదువు ఇటు కరాటే లో ఉత్తమ ప్రతిభ కనపర్చడం అభినందనీయమని, నేపాల్ లో జరిగే కరాటే పోటీలలో పాల్గొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకుంటున్న విషయం తెలుసుకున్న జిల్లా మహిళా ప్రాంగణ అధికారిణి వేల్పుల విజేత వ్యక్తిగతంగా తన వంతు ఆర్థిక సహాయంగా పదివేల రూపాయలు మంగళవారం మహిళా ప్రాంగణంలో అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా మహిళా ప్రాంగణ అధికారిణి వేల్పుల విజేత మాట్లాడుతూ...రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభినయశ్రీ నేపాల్ లో జరిగే కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, దేశ ప్రతిష్టను మరింత పెంపొందించే విధంగా పోటీపడి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని అకాంక్షించారు. అదే విధంగా అభినయశ్రీ కరాటే శిక్షకుడు రామకృష్ణ కృషిని అభినందించారు.

రాఘవేంద్రపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి-ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 20 : పూడూరు మండల బీజేపీ అధ్యక్షుడు రాఘవేంద్రపై దాడి చేసిన అధికార పార్టీకి చెందిన కడుమూరు ఆనందంపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మంగళవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డికి మెమోరాండం సమర్పించారు.

మంగళవారం వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందరెడ్డి, సీనియర్ నాయకులు మల్లేశం పటేల్, మండల పార్టీ అధ్యక్షుడు రాఘవేంద్రతో కలిసి ఆయన ఎస్పీ నారాయణరెడ్డిని కలిశారు. ఈసందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడిపై దాడి శోచనీయమన్నారు. వెంటనే కడుమూరు ఆనందం పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

టూరిజంపై ప్రత్యేక దృష్టి- మంత్రి జూపల్లి



వరంగల్, ఆగష్టు 20 :దేశంలో, రాష్ట్రంలో అనేక గొప్ప గొప్ప కట్టడాలు, దేవాలయాలు, పర్యటక ప్రాంతాలు వున్నాయని రాష్ట్ర ప్రభుత్వం టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని ప్రొహిబిషన్ ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జయశంకర్ జిల్లా వర్యటనలో భాగంగా మంత్రి రేగొండ మండలం కొడవటంచ శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యలతో కలిసి కొడవటంచ ఆలయంలో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలకు, ఆలయ అభివృద్ధి పనులకు రూ.12 కోట్ల 15లక్షలతో పనులకు శంకుసాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక అద్భుతమైన కట్టడాలు, కళారూపాలు వున్నాయని, సాంస్కృతిక సంపద, శిల్పకళా ఉందని తరించాలని మంత్రి కోరారు.

నెలకు ఒక రోజు కొత్త ప్రాంతాలను సందర్శించాలని, దీంతో ప్రశాంతత దొరుకుతుందని సూచించారు. అదేవిధంగా భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని నిత్యం 500మందికి పైగా దర్శించుకుంటున్నారని భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలతో పాటు హోటల్ ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. మంత్రి జూపల్లి సానుకూలంగా స్పందించి వారం రోజుల్లో ఎస్టిమేషన్ తయారు చేయించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. భూపాలపల్లిలో అనేక టూరిజం ప్రాంతాలు ఉన్నాయని, టూరిజం శాఖ మంత్రి దృష్టి సారించి నిధులు కేటాయించాలని కోరారు. తన ఎంపీ నిధులు కూడా కేటాయిస్తానని తెలిపారు. అనంతరం తిరుమలగిరి శివారు బుగులోని శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకుని గుట్టను పరిశీలించారు. అక్కడినుండి పాండవులు గుట్టలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమోత్సవంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క తో కలిసి పాండవులగుట్ట వద్ద ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీ , ఏవిని తిలకించారు.

పాండవులగుట్ట అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత.. మంత్రి జూపల్లి

భూపాలపల్లి జిల్లాలో పాండవులు అజ్ఞాత వాసం చేసిన చారిత్రాత్మకత కలిగిన ప్రాంతం పాండవుల గుట్టలు అని, ఆదిమానవులు వేసిన చిత్రాలు నేటికీ ఈ గుహలో ఉన్నాయని, ఇది ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతం అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాల్సిందిగా మంత్రిని కోరారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. దేశం నలుమూలల నుండి పర్యాటకులను ఆకర్షించే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టవలసి ఉందన్నారు.

సాధ్యాసాధ్యాలను పరిశీలించి పర్యాటకులకు శాశ్వత, తాత్కాలిక మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు అధికారులతో ఎస్టిమెంట్ వేయించడం జరుగుతుందన్నారు. పంచాయతీరాజ్ శాఖ, ఆర్ అండ్ బీ అటవీశాఖ మంత్రులతో చర్చించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మంత్రి జూపల్లి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, వివిధ శాఖల చైర్మన్లు, డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ జె. వసంత, జిల్లా అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి శ్రీశైలం మల్లన్న దేవస్థానం సర్కారీ సేవ..!

శ్రీశైలం, ఆగష్టు 20 : భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కొలువైన శ్రీశైలం ఆలయంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు నిర్వహించారు. లోక కల్యాణం కాంక్షిస్తూ దేవస్థానం సర్కారీ సేవగా నిర్వహించింది. మంగళ, కృతికానక్షత్రం, షష్ఠి తిథుల్లో కుమారస్వామికి విశేష అభిషేకం, విశేష పూజలను శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తూ వస్తున్నది. అభిషేకానికి ముందు దేశంలో శాంతి, సౌభాగ్యాలు విలసిసల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా తగినంత వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా కురవాలని.. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని అర్చకులు మొదట సంకల్పం పటించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ నిర్వహించారు. అనంతరం కుమార స్వామికి అభిషేకం పంచామృతాలు, వివిధ ఫలరసాలతో అభిషేక అభిషేకం చేశారు.

అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠా అరెస్ట్.. 22 కిలోల గంజాయి స్వాధీనం

అమరావతి, ఆగష్టు 20 :ఆంధ్రప్రదేశ్ (ఎనిటిఫ్టీజీ ఖతీజీటవబష్ట) లోని పలు ప్రాంతాల నుంచి గంజాయి రవాణాచేస్తున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను విజయనగరం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా ధర్మవురి ప్రాంతంలోని వసంత విహార్ విల్లాలో ఉత్తరప్రదేశ్‌లోని మేరట్, ఢిల్లీకి చెందిన ముగ్గురు గత ఏడాదిగా ఢిల్లీకి గంజాయిని రవాణా చేస్తున్నారని తెలిపారు. మేరర్‌కు చెందిన మహ్మద్ వసీం, అరకులోయలోని విశ్వనాథం నుంచి గంజాయిని కొనుగోలు చేసి అలాం ఖుర్షిద్ ద్వారా ఢిల్లీకి రవాణా చేస్తున్నారని వివరించారు. ఈ ముగ్గురు విజయనగరం లోని వేర్వేరు ఇండ్లల్లో అద్దెకు ఉంటూ గంజాయి రవాణాకు పాల్పడుతున్నారని వెల్లడించారు.

ఈ కేసులో ప్రధాన నిందితుడిగా కబీర్‌గా గుర్తించామని, మరో 5గురు గంజాయి రవాణాలో ప్రమేయం ఉందని తెలిపారు. నిందితుల నుంచి 22 కిలోల గంజాయి, రవాణాకు వినియోగిస్తున్న వస్తువులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వివరించారు. మిగతా నిందితులను కూడా త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు.

అంక్షలు లేని రుణమాఫీ ఇవ్వాలి.. ఎమ్మెల్యే ధనపాల్

నిజామాబాద్, ఆగష్టు 20 :రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు లేని రుణమాఫీ రైతులకు వెంటనే అందజేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్య స్థాపన అంటు తెలంగాణ ప్రజలను నిండా ముంచింది కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ బీజేపీ విలీనమంటూ ప్రజలను కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు.

మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ? కాంగ్రెస్ నాయకులు పదేపదే ఇందిరమ్మ రాజ్యమని మాట్లాడుతున్నాంన్నారు.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ పాలన వచ్చేలా ఉందని విమర్శించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీలతో యావత్ తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రజలందరూ కాంగ్రెస్ పాలన పట్ల విసుగు చెందారన్నారు.

కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే ఈ రాష్ట్రంలో ఆత్మహత్యలు తప్ప ఇంకా ఏమి మిగలవన్నారు. ఇప్పటికే కర్ణాటకలో 1200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనే ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ పాలన, ఆత్మహత్యల పాలన, దోపిడీ పాలన అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, కాంగ్రెస్ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే స్థానిక, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

భూ అక్రమార్కుల బాగోతాన్ని బయటపెట్టాలి?

నిజామాబాద్ నగరంలోని భూ అక్రమార్కుల చేతిలో మోసపోయిన వారికి న్యాయం చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నాగారం బొందెం చెరువు కబ్జాల వెనుక బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి సామాన్య ప్రజలను మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మోసపోయిన ప్రజలకు న్యాయం చేయాలని కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ బ్యాంక్‌కు తాళం వేసి రైతుల నిరసన

ఖమ్మం, ఆగష్టు 20 : (నేటినిజం ప్రతినిధి): తమకు రుణమాఫీ కావడం లేదని ఆవేదన చెందిన ఖమ్మం(ఐఫ్టజీఎఎజీఎ) జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన రైతులు ఏపీజీవీబీకి తాళం వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఏపీజీవీబీ బ్యాంక్ పరిధిలో సుమారు 7 గ్రామాలకు చెందిన 200 మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని ఆందోళనతో మంగళవారం బ్యాంకు వద్దకు చేరుకున్నారు. తక్షణమే రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం బేషరతుగా ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుబంధు నగదు విడుదల చేయాలన్నారు. ఏపీజీవీబీ పరిధిలోని ఒక్క గ్రామంలో కూడా 50 శాతానికి మించి రుణమాఫీ జరగలేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కోసం వ్యవసాయాధికారుల కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ సాధారణ రైతులను తిప్పించుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఎలాంటి ఆంక్షలు లేకుండా సాగుచేసే ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో.. అనంతగిరి వాటర్ ఫాల్స్ కు జలకళ..

హైదరాబాద్, ఆగష్టు 20 :సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వికారాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని అనంతగిరి గుట్టపై నుండి భారీ జలపాతాలు కొనసాగుతున్నాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మర్పల్లి, మోమిన్ పేట్, దారూర్ తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది.

ఈ కారణంగా అనంతగిరిలోని గుట్టపై నుండి భారీ జలపాతం కేరివైపు కొనసాగుతుంది. పర్యాటకులు ఈ జలపాతాన్ని చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే ఈ జలపాతం వస్తుంది. కనువిందు చేసే ఈ దృశ్యాన్ని సందర్శికులు చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నెల్లూరు ప్రాజెక్టులకు పాత పేర్లనే పునరుద్ధరించాలి : మాజీ మంత్రి కాకాణి

అమరావతి, ఆగష్టు 20 : నెల్లూరు జిల్లాలో ఉన్న సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్ లకు ఇదివరకు ఉన్న పేర్లను పునరుద్ధరించాలని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగం బ్యారేజ్‌కు మంత్రిగా ఉంటూ మరణించిన గౌతమ్ రెడ్డి పేరును, నెల్లూరు బ్యారేజ్‌కు మాజీ మంత్రి నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేరును ఎందుకు తొలగించారని నిలదీశారు. పాత పేర్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు వైసీపీ హయాంలో కొనసాగిన పథకాల పేర్లను తొలగిస్తున్నారే తప్పా కొత్తవి ఏమీ చేపట్టడం లేదని ఆరోపించారు. 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి ఏనాడు ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేనది వైసీపీ పూర్తి చేసిందన్నారు. ప్రచార అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు వాటి విస్తరణ పనులు చేపట్టి రైతాంగానికి నీరందించారని తెలిపారు.

సంగం, నెల్లూరు బ్యారేజ్‌లను ఆర్భాటాలే తప్ప చంద్రబాబు పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా సోమశిల పనులను నాణ్యతతో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీపై ఎవరి మాట నమ్మాలి.. ముఖ్యమంత్రే క్లారిటీ ఇవ్వాలి: హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగష్టు 20 : రుణమాఫీ పై కాంగ్రెస్ పార్టీ నాయకులు తలాతోక లేకుండా రోజుకో తీరుగా మాట్లాడటం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రేమో రుణమాఫీ పూర్తి చేసినట్లు డబ్బా కొడితే, మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం రుణమాఫీ పూర్తి కాలేదంటున్నరని అన్నారు.

మొన్న ఖమ్మం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి రూ.18వేల కోట్లతో రుణమాఫీ పూర్తిగా చేసినట్లు ప్రకటిస్తే, ఇందుకు భిన్నంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుణమాఫీ పూర్తిగా జరగలేదని, ఇంకా 12 వేల కోట్లు కూడా విడుదల చేస్తామని అన్నారని హరీశ్‌రావు గుర్తుచేశారు. మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంకా 17 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదంటున్నారని అన్నారు. ఇక ఈరోజు రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలోనే పచ్చి అబద్ధం చెప్పారని మండిపడ్డారు. ఏకంగా 31వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేసినట్లు ప్రకటించారని తెలిపారు. ఏది నిజం అని ప్రశ్నించారు. ఇందులో ఎవరి మాటలు నమ్మాలో ముఖ్యమంత్రి చెప్పాలె అని స్పష్టం చేశారు.

ఒకవైపు రుణమాఫీ కాక రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తంటే, భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడి మరింత గందరగోళం సృష్టిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. మీరు చెబుతున్నట్లు రుణమాఫీ జరిగి ఉంటే బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ, కలెక్టరేట్ల చూట్టూ రైతులు ఎందుకు చెప్పులరిగేలా తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఎందుకు రోడ్లెక్కి రుణమాఫీ కాలేదనే ఆవేదనతో ఆందోళనలు చేస్తున్నారని నిలదీశారు. ఇప్పటికైనా రైతు రుణమాఫీ పూర్తి కాలేదన్న వాస్తవాన్ని ముఖ్యమంత్రి ఒప్పుకొని రైతులకు క్షమాపణ చెప్పాలని అన్నారు. వెంటనే రుణమాఫీ పై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 వరకు రైతులందరిరీ రుణవిముక్తులుగా చేస్తానన్న హామిని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ.. ఎమ్మెల్యే గండ్ర

వరంగల్, ఆగష్టు 20 : దేశ ప్రధానిగా స్వర్గీయ రాజీవ్ గాంధీ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి, బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసి, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా మంగళవారం భూపాలపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దేవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

అనంతరం రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కంప్యూటర్లు, సెల్ ఫోన్లు, టెలికాం, ఐటీ రంగాల్లో మన దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నేత,

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్, ఆగష్టు 20 : (నేటినిజం ప్రతినిధి) స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసినటువంటి అభినందన సమావేశానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాస్కెట్బాల్లో ఎన్నో విషయాలు నేర్చుకునేవి ఉంటాయని ప్రత్యేకంగా విజయాలను సాధించే విధానాలను చాలా తెలుసుకుంటామని చెప్పారు. బాస్కెట్బాల్లో లభించే లాభాలు అధికంగా ఉంటాయని చెప్పారు. విద్యార్థులకు పోటీతత్వంతో పాటు సత్సంబంధాలు ఏర్పరిచే విధంగా ఉంటాయని తెలుపుతూ ప్రతి విద్యార్థి క్రీడా రంగాల్లో పాల్గొని వాటిలోని విషయాలను సముచితంగా తెలుసుకొని ఉత్తమంగా ఉండాలని వారు సూచించారు. క్రీడల ద్వారా కలిగే విశిష్ట లాభాలవలన పాఠశాల విద్యా ప్రణాళికలో భాగంగా విద్యార్థులను వివిధ పోటలకు ఎంపిక చేయడమే కాకుండా అందులో విజయాన్ని సునాయానంగా అందుకోవడానికై ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని చెప్పారు. ప్రాథమికంగా విద్యార్థులకు పాఠశాలలో ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని అందులో ప్రతిభను కనబరచిన వారికి పోటీలకు ఎంపిక చేస్తామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంలోని డా?బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో కరీంనగర్ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ వారు నిర్వహించినటువంటి జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన అశ్విన్.జి., రాఘవేంద్ర.కె, సిద్ధార్థ్, మోహనిష్, మోట్పాని శరన్, రణదీర్ బాలుర విభాగంలో మరియు బాలికల విభాగంలో ముగ్గా, సనికితి, జస్లిన్, కె. పూజిత చౌదరి, అండర్ 16 విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడమే కాకుండా త్వరలో ఈ నెల 25 మరియు 26 తేదీలలో మహాబూబ్నగర్ జిల్లాలో నిర్వహింపబడే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం చాలా గొప్ప విషయమని ప్రశంసించారు.

ఎంపికన విద్యార్థులందరికి పుష్పగుచ్చాలతో పాటు అర్హత పత్రాలను అందజేసి జాతీయ స్థాయి పోటీలకు సైతం ఎంపికై నూతన ఒరవడిని సృష్టించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్టోబర్ 20 నుండి అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం..

హైదరాబాద్, ఆగష్టు 20 :నిజాంపేట్ లోని శ్రీనివాస్ నగర్ లో కొలువైన శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో అక్టోబర్ 20 నుండి డిసెంబర్ 20 వరకు నిత్య అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ప్రతి సంవత్సరం నిర్వహించే అయ్యప్ప మాలధారణ, పడిపూజలు, స్వామివారి కైంకర్యాల సేవల నిమిత్తమై ఆలయ ప్రాంగణంలో మంగళవారం దేవాలయ కమిటీ సమావేశమైంది. ఆలయ చైర్మన్ కొలను చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ వైస్ చైర్మన్ శనిగల ధన్ రాజ్ యాదవ్, ప్రధాన అర్చకులు నాగార్జున ఆచార్యుల ఆధ్వర్యంలో కమిటీ సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు.

అక్టోబర్ 20నుండి డిసెంబర్ 20 వరకు దేవాలయ ప్రాంగణంలో నిత్యాన్నదానం నిర్వహించబడునని స్పష్టం చేశారు. అయ్యప్ప భక్తుల మాలధారణ వారి రాకను బట్టి అన్నదాన కార్యక్రమం పొడిగించబడునని ఆలయ కమిటీ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాఘవేందర్ రావు, ఆలయ ట్రెజరర్ ఉంగరాల శ్రీనివాస్ రావు, గురు స్వామి ఇంద్ర కుమార్ దేవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరిబాబు , జాయింట్ సెక్రటరీ నతీష్, తదితరులు పాల్గొన్నారు.

పడిపూజ, అన్నదానం కోసం సంప్రదించండి..

అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో కార్తీకమాస మండల పూజను పురస్కరించుకొని నిర్వహించే పడిపూజ, అన్నదానం, స్వామి వారి కైంకర్యాలు, ఇతరత్రా సేవల కోసం సంప్రదించాలని ఆలయ ప్రధాన పూజారులు నాగార్జున ఆచార్యులు కోరారు.

సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం

ప్రతి సంవత్సరం నిర్వహించే అయ్యప్ప మాలధారణ, పడిపూజలు, ఇతరత్రా ప్రత్యేక పూజలు నిమిత్తమై అయ్యప్ప స్వామి దేవాలయం సర్వంగ సిద్ధనంగా సిద్ధమైంది. రెండు సంవత్సరాల క్రితం వేద పండితుల ఆశీర్వచనాలు, ప్రత్యేక ప్రతిష్ట, హోమాలతో ప్రారంభమైన అయ్యప్ప స్వామి దేవాలయం దినదినాభివృద్ధి చెందుతూ వస్తుంది.

అయ్యప్ప భక్తుల రాక, మాలధారణ సైతం సైతం గత రెండు సంవత్సరాల్లో గణనీయంగా పెరిగింది. అయ్యప్ప భక్తుల కోసం సకల సౌకర్యాలను దేవాలయ కమిటీ కల్పించింది. ఇక ఈ సంవత్సరం ఇప్పటికే దేవాలయానికి పెయింటింగ్ పూర్తి కావడంతో ఆలయం నూతన శోభతో కళకళలాడుతుంది.

రుణ మాఫీ కానీ రైతుల కోసం బిజెపి నిరసన...

-రైతులతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

-ప్రభుత్వాలు మారిన తీరని రైతుల కష్టాలు

-మానకొండూర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి

కరీంనగర్, ఆగష్టు 20 : (నేటినిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ గన్నేరువరం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున రుణమాఫీ కానీ రైతుల కోసం అండగా నిలిచి నిరసన కార్యక్రమం చేపట్టింది. అనంతరం ఎమ్మార్వోకి వినతి పత్రం సమర్పించారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి గ మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 2 లక్షల వరకు రుణ మాఫీ ఏక కాలంలో చేస్తామని గద్దెనెక్కి, కేవలం 17993/- వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి మిగతా రైతులను మోసం చేసిందన్నారు. రుణమాఫీ విషయంలో రైతులను అయోమయానికి గురిచేయకుండా ప్రతి ఒక్కరికి తక్షణమే రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రుణమాఫీ చేయలేని పక్షంలో ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి రైతుల పక్షాన పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ..ఈ కార్యక్రమంలో ఒబిసి మోర్చా ఈసీ మెంబర్ మచ్చ బాలరాజు ,. మండల ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి పర్శరామ్ గౌడ్, వీరగోని వెంకటేష్., ఉపాధ్యక్షులు మునిగంటి సత్తయ్య, బండి తిరుపతి.,బుర్ర శ్రీనివాస్. ,పుల్లెల రాము,దళిత మోర్చా అధ్యక్షులు బామండ్ల రాజు,. గంగాధర తిరుపతి ,మడికంటి స్వామి., మర్దనాపేట నరేష్. సాకేత్. మచ్చ మురళి., కుర్ర హరీష్. రామిడి కృష్ణమూర్తి., గోవర్ధన్ రెడ్డి..మఠం రాజు .,శేఖర్ ,లచ్చయ్య, శివ, అజయ్ తదితరులతోపాటురైతులు పాల్గొన్నారు. ..

రుణ మాఫీ కానీ రైతుల కోసం బిజెపి నిరసన...

-రైతులతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

-ప్రభుత్వాలు మారిన తీరని రైతుల కష్టాలు

-మానకొండూర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి

కరీంనగర్, ఆగష్టు 20 : (నేటినిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ గన్నేరువరం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున రుణమాఫీ కానీ రైతుల కోసం అండగా నిలిచి నిరసన కార్యక్రమం చేపట్టింది. అనంతరం ఎమ్మార్వోకి వినతి పత్రం సమర్పించారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి గ మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 2 లక్షల వరకు రుణ మాఫీ ఏక కాలంలో చేస్తామని గద్దెనెక్కి, కేవలం 17993/- వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి మిగతా రైతులను మోసం చేసిందన్నారు. రుణమాఫీ విషయంలో రైతులను అయోమయానికి గురిచేయకుండా ప్రతి ఒక్కరికి తక్షణమే రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రుణమాఫీ చేయలేని పక్షంలో ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి రైతుల పక్షాన పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ..ఈ కార్యక్రమంలో ఒబిసి మోర్చా ఈసీ మెంబర్ మచ్చ బాలరాజు ,. మండల ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి పర్శరామ్ గౌడ్, వీరగోని వెంకటేష్., ఉపాధ్యక్షులు మునిగంటి సత్తయ్య, బండి తిరుపతి.,బుర్ర శ్రీనివాస్. ,పుల్లెల రాము,దళిత మోర్చా అధ్యక్షులు బామండ్ల రాజు,. గంగాధర తిరుపతి ,మడికంటి స్వామి., మర్దనాపేట నరేష్. సాకేత్. మచ్చ మురళి., కుర్ర హరీష్. రామిడి కృష్ణమూర్తి., గోవర్ధన్ రెడ్డి..మఠం రాజు .,శేఖర్ ,లచ్చయ్య, శివ, అజయ్ తదితరులతోపాటురైతులు పాల్గొన్నారు. ..

రాజీవ్ గాంధీ ఆలోచనా విధానం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం

– దివంగత ప్రధాని జయంతిలో రాష్ట్ర మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి



ఖమ్మం, ఆగష్టు 20 : (నేటినిజం ప్రతినిధి): దివంగత ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ నవభారత నిర్మాణానికి ఎన్నో సంస్కరణలు చేశారని, ఆయన ఆలోచనా విధానం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించు కొని.. కూసుమంచిలోని ప్రధాన రహదారి వెంట ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ... 1980 తర్వాత సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి పరిచయం చేసిన గొప్ప నేత అని కొనియాడారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో సరికొత్త పంథాను అవలంబించారని అన్నారు. అణగారిన వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేసి.. ఆదర్శ పాలన అందించారని తెలిపారు. రాజీవ్ గాంధీ కి జోహార్లు పలుకుతూ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం!

హైదరాబాద్, ఆగష్టు 20 :సాయంత్రం భారీ వర్షం మొదలైంది. దట్టమైన మేఘాలు కమ్ముకుని భారీ వర్షం ప్రారంభమైంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరం లోని కుత్బుల్లాపూర్, కూకట్ పల్లి, శేరిలింగంపల్లి, నిజాంపేట్, మియాపూర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, పంజాగుట్ట, అమీర్ పేట్, మహదీపట్నం, షేక్ పేట్, ఆసిఫ్ నగర్, కాప్రా తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయ్యాయి. ఇక ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

మిద్దె కూలింది- బతుకు తెల్లారింది

అమరావతి, ఆగష్టు 20 :నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం లొని వెలుగోడు పట్టణంలోని అమ్మవారి శాల వీధిలోమట్టి మిద్ద కూలి ఒకరు మృతి చెందగా, ఇద్దరికీ గాయాలు అయ్యాయి?. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మట్టి మధ్య నాని నాని ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన లో కుమ్మరి మద్దమ్మ .. అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి చేర్పించారు చికిత్స నిమిత్త. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

– ఆగస్టు 22న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయండి

– పోస్టర్ల ఆవిష్కరణ

– ఎన్.వి రాకేష్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సంయుక్త మండల సహాయ కార్యదర్శి

ఖమ్మం, ఆగష్టు 20 : (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రేపు 22న సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో మంగళవారం 22న చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సంయుక్త మండల సహాయ కార్యదర్శి ఎన్.వి రాకేష్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటిందని అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ప్రజలకు ఇచ్చిందని ప్రజలకు హామీ ఇచ్చిన ప్రకారం తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇంటి స్థలం లేని వారికి ఇంటిస్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, అర్హులైన వారందరికీ ప్రభుత్వ వాగ్దానం ప్రకారం పెన్షన్లు ఇవ్వాలని, జీవన భృతి ఇవ్వాలని, రైతాంగ రుణాలను పూర్తిగా రద్దుచేసి బ్యాంకర్ల కొండి లేకుండా కొత్త రుణాలు అందరికీ ఇవ్వాలని, పంటల బీమా వెంటనే అమలు చేయాలని, వాస్తవ సాగుదారులందరికీ రైతు భరోసా అందించాలని, కౌలు రైతులను గుర్తించుటకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలని, ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని, వ్యవసాయ కార్మికులకు ప్రకటించిన రూ.12 వేల జీవన భృతి వెంటనే అమలు చేయాలని భవన నిర్మాణ ఇతర అసంఘటిత కార్మికులకు సెలవులతో కూడిన కనీస వేతనాలను అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలని, నిరుద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం ప్రకటించి, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, గిరిజనులకు గిరిజన ఇతరులకు పోడు సాగుదారులంద రికీ సాగు హక్కులు పట్టాలు ఇవ్వాలని, ఆటో కార్మికులకు ఏడాదికి 12,000 ఇవ్వాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల నాయకులు చల్లా రాజు, రాము, దాను, అనిల్, తదితరులున్నారు.

అగస్టు 21న జరుగు భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

మాల మహానాడు సీనియర్ నాయకులు గుంతెటి వీరభద్రయ్య, లింగాల రవికుమార్,మూడుసు జాకోబ్,దామళ్ల సత్యం

ఖమ్మం, ఆగష్టు 20 : (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా మాల మహానాడు,నగర మాల మహానాడు కమిటీల నాయకులకు కార్యకర్తలకు మాల కుల బంధువులకు ఆత్మీయులకు సమస్త మాల జాతికి తెలియజేయునది. ఆగస్టు 21 తారీకు నాడు ఎస్సీ కులాల వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని పునర్ పరిశీలించా లని కోరుతూ దేశవ్యాప్తంగా బందును ప్రకటించడం జరిగింది. ఈ బందును మాల సామాజిక వర్గం మొత్తం కూడా ప్రతి ఒక్క కార్యకర్త సైనికులుగా పాల్గొని 341ఆర్టికల్ ను యధా విధంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్ ఉద్యమాలు చేయాల్సిన అవసరం మాల జాతి బుజాస్కందాల మీద ఉన్నది జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపులను విజయవంతం చేయుటకు అన్ని మండల కేంద్రాలలో జిల్లా సెంటర్లలో అన్ని రకాల వ్యాపార సంస్థలను దుకాణాలను సూపర్ మార్కెట్ షాపులను అన్నింటిని బందు పెడుతూ స్తంభింప చేయాలిని కోరుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది. ఈ బందును విజయవంతం చేయుటకు ఉదయం నుండే బందులో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది. జిల్లాలో ఉండబడినటు వంటి అన్ని వర్గాల వ్యాపారస్తులు పారిశ్రామికవేత్తలు విద్యాసంస్థల కరస్పాండెన్స్, ప్రిన్సిపాల్స్, ప్రైవేట్ వైద్య రంగాల సంస్థల మేనేజ్మెంట్స్ వారందరూ కూడా సహకరించాలని బందును పాటించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి విజ్ఞప్తి చేస్తుంది. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు కొరివి దయానంద్, జిల్లా అధ్యక్షుడు కొట్టె సుధాకర్, ప్రధాన కార్యదర్శి గుమ్మడి కనకరాజు, నగర అధ్యక్షుడు తురక నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి శ్రీనివాస్, మెట్టు వెంకటేశ్వర్లు, కామా ప్రభాకర్, ప్రచార కార్యదర్శి జమ్మి వీరబాబు, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం మల్లయ్య, ఉపాధ్యక్షులు ఎర్ర గంగాధర్, గాదరి బాబు, తలారి రాధాకృష్ణ, కొప్పుల రామారావు, తప్పెట్ల భాస్కర్, సహాయ కార్యదర్శులు చింతపల్లి వెంకటేశ్వర్లు, కరాటే వేణు, కొర్లపాటి చిరంజీవి, కొట్టే నాగేందర్, సిహెచ్ గురుమూర్తి, పప్పుల వేణు, రాయల శ్రీను, గుంతెటి ప్రభాకర్, కాసిమల్ల మహేందర్ నాథ్, దామల శివ, కటుకూరి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONORABLE XII ADDL CHIEF JUDGE. AT : SECUNDERABAD.

O.P.NO 467 of 2023

Between;

B. Sriram

...Petitioner.

AND

G. Jaya Simha Reddy & Another.

...Respondents.

TO, R1

1. G. Jaya Simha Reddy S/o. G. Keshava Reddy R/o. H.No.Villa No-22, Manchiravula Narsinghi Gandipet, Ranga Reddy T.S- 500 089

Please take notice that the above petitioners have filed the above O.P. for compensation for the Damages caused to the Car B.No.-TS 30 D 9569, Pertain's to Mr. B. Sriram in R.T.A. a gainst you and another Res pondents. The above cas e is posted on **28-08-24,** for your appearance at about 10-30 A.M before the above said court. Hence you are hereby called upon to appear before the above said court on the above said time personally or thro ugh your counsel. If you are failed to appear the matter will be decided in your absence.

(By the order of the court)

Sri.K.Chandrashekar,
Advocate
Secunderabad.
Ph-9290997676.

శ్రీ దుగ్గిరాల మూర్తి
స్మారక పురస్కార ప్రదానోత్సవం - 2024
సమాహ్వానం

వేదిక
శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం
సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్

తేదీ
25.08.2024, ఆదివారం
సా. 5:00 గం.ల నుండి రాత్రి 8:30 వరకు

కార్యక్రమ ప్రణాళిక
సాయంత్రం 5:30 నుండి పురస్కార సభ

శ్రీ దుగ్గిరాల మూర్తి స్మారక పురస్కార గ్రహీత
మహామహోపాధ్యాయ **ఆచార్య శలాక రఘునాథ శర్మ** గారు

ప్రధాన వక్త
మధుర భారతి, ప్రవచన వాచస్పతి
ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి గారు
అంశం : శ్రీమద్రామాయణ కల్పవృక్ష వైభవం

సభాధ్యక్షులు : **ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి** గారు
విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, అధ్యక్షులు డి.ఏ.ఎల్.ఎస్. మూర్తి స్మారక సమితి

ముఖ్య అతిథి, పురస్కార ప్రదాత
ఆచార్య సాగి కమలాకర శర్మ గారు
తెలుగు శాఖాధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఆత్మీయ అతిథి
శ్రీమతి దుగ్గిరాల భువనేశ్వరి గారు

సన్మాన పత్ర రచన పఠనం
'పద్యకళా ప్రవీణ' **డా. ఆచార్య ఫణీంద్ర** గారు, అధ్యక్షులు, యువభారతి

కార్యక్రమ సంయోజకులు
శ్రీ సాధన నరసింహాచార్య

ప్రధాన కార్యదర్శి: శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ
ఉపాధ్యక్షులు: డా. జి.ఎం. రామ శర్మ
ఉపాధ్యక్షులు: డా. ఆచార్య ఫణీంద్ర
ఉపాధ్యక్షులు: శ్రీ మావుదూరు సూర్యనారాయణ మూర్తి
కార్యదర్శి: శ్రీమతి దుగ్గిరాల జయలక్ష్మి
కోశాధికారి: శ్రీ దుగ్గిరాల వాసుదేవరావు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.